నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
1
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

నగరంలో బాలిక కిడ్నాప్


రమ్య (ఫైల్)

నవతెలంగాణ-కంఠేశ్వర్

రోడ్డు పక్కన తల్లితోపాటు నిద్రిస్తున్న బాలికను దుండగుడు కిడ్నాప్ చేశాడు. ఈ ఘటన నిజామాబాద్ నగరంలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. నగరంలోని నాగారం ప్రాంతానికి చెందిన శిరీష తన మూడేండ్ల కూతురు రమ్యతో ఒకటవ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీచౌక్ ప్రాంతంలో రోడ్డు పక్కన నిద్రిస్తుండగా గుర్తుతెలియని దుండగుడు పాపను ఎత్తుకెళ్లాడు. కొద్ది సేపటి తరువాత మెలకువ వచ్చిన శిరీష పక్కన కూతురు లేకపోవడంతో ఆందోళన గురైంది. వెంటనే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు సీసీ పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు. ఒకటవ టౌన్ ఎస్‌హెచ్‌ఓ రఘుపతి ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలతో గాలింపు చర్యలు చేపట్టారు. జిల్లా కేంద్రంలో ఎవరైనా బాలికను గుర్తిస్తే సంబంధిత డయల్ 100 లేదా ఒకటవ పోలీస్ స్టేషన్లో సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉత్కంఠ భరితంగా కుస్తీ పోటీలు


గెలుపొందిన వారికి బహుమతి పంపిణీ చేస్తున్న దృశ్యం

నవతెలంగాణ-గాంధారి

మండల కేంద్రంలో శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుస్తీ పోటీలు ఉత్కంఠభరితంగా కొనసాగాయి. కుస్తీ పోటీల్లో పాల్గొనడానికి మహారాష్ట్ర, కర్ణాటక, జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి మల్ల యోధులు పాల్గొన్నారు. గెలుపొందిన మల్లయోధులకు శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు నగదుతో పాటు వెండి కడియాలను బహుమతులుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు, శ్రీరామ ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వినతులు పెండింగ్‌లో పెట్టొద్దు

- ఎప్పటికప్పుడు పరిష్కరించాలి
- అధికారులకు నిజామాబాద్, కామారెడ్డి కలెక్టర్ల సూచన
- ఉమ్మడి జిల్లాలో 143 ఫిర్యాదులు స్వీకరణ


నిజామాబాద్‌సిటీ : ఫిర్యాదులను స్వీకరిస్తున్న నిజామాబాద్ కలెక్టర్


కామారెడ్డి : ఫిర్యాదులను స్వీకరిస్తున్న కామారెడ్డి కలెక్టర్

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ/కామారెడ్డి

ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 70 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు అంకిత్, కిరణ్ కుమార్, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, డీపీఓ శ్రీనివాస్, నిజామాబాద్ ఆర్డీఓ రాజేంద్రకుమార్, మెప్మా పీ.డీ రాజేందర్, నిజామాబాద్ ఏసీపీ రాజా వెంకటరెడ్డిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కామారెడ్డి : ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి తదుపరి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా భూముల సమస్యలు, రెండుపడక గదుల ఇండ్లు మంజూరు, రైతు భరోసా, పింఛన్లు మంజూరు తదితర అంశాలపై ఫిర్యాదులు అందాయి. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో (73) ఫిర్యాదులు పలు శాఖలకు చెందినవి అందాయని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రజావాణిలో వచ్చిన అర్జీలను పరిశీలించి సాధ్యాసాధ్యాల మేరకు సత్వర చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. పెండింగులో ఉన్న అర్జీలపై చర్యలు చేపట్టి దరఖాస్తుదారునికి సమాచారం అందించాలని తెలిపారు. ఈ ప్రజావాణిలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, జడ్పీ సీఈవో చందర్, ఆర్డీఓ వీణ, పలు శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


చికిత్స పొందుతున్న బాధితులు


బాధితులను పరామర్శిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

కల్తీకల్లుతో వింత చేష్టలు

- 20 మందికి పైగా ఆస్పత్రి పాలు
- ముగ్గురి పరిస్థితి విషమం
- ఆస్పత్రులకు తరలింపు
- బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో ఘటన
- బాధితులను పరామర్శించిన బాన్సువాడ సబ్‌కలెక్టర్

నవతెలంగాణ-నసురుల్లాబాద్

కామారెడ్డి జిల్లా బాన్సువాడ డివిజన్ పరిధిలోని బీర్కూర్, నసురుల్లాబాద్ మండలాల్లో కల్తీకల్లు తాగి ప్రజలు వింత చేష్టలు చేస్తూ ఆస్పత్రి పాలయ్యారు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. కల్తీకల్లుతో చస్తే గానీ పట్టించుకోరా..? అంటూ బాధిత కుటుంబ సభ్యులు అధికారులపై, పాలకనేతలపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులు, కూలీలు కల్లుకు బానిసై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నా.. కనీసం పాలకనేతలు కల్తీకల్లు నిర్వాహకులపై మాట్లాడకపోవడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. ఇదిలా ఉండగా.. బాధితులను బాన్సువాడ సబ్‌కలెక్టర్ కిరణ్మయి ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

వివరాలు మెయిన్‌లో..

పోలీస్‌స్టేషన్‌ను ముట్టడించిన తాళ్ళరాంపూర్ గ్రామస్తులు

- సీఐ సర్దిచెప్పడంతో వెనక్కి.


పోలీస్‌స్టేషన్ వద్ద తాళ్లరాంపూర్ గ్రామస్తులు

నవతెలంగాణ-ఏర్గట్ల

ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌ను తాళ్లరాంపూర్ గ్రామస్తులు సోమవారం ముట్టడించారు. గ్రామం నుంచి పోలీస్‌స్టేషన్ వరకు పాదయాత్రగా తరలివచ్చారు. వివరాల్లోకి వెళితే.. గత కొన్ని నెలలుగా కల్లుగీత విషయంలో గ్రామస్తులకు, గౌడ కులస్తులకు మధ్య వివాదం నడుస్తోంది. అయితే రామనవమి సందర్భంగా కుంకుమార్చన పూజ విషయంలో గౌడ కులానికి చెందిన మహిళలను పూజలో పాల్గొనవద్దని గ్రామకమిటీ సభ్యులు అన్నట్లు పోలీసులకు గౌడ సంఘం సభ్యులు తెలపడంతో.. విచారణ చేసిన పోలీసులు ముగ్గురు గ్రామకమిటీ సభ్యులు, ఓ పూజారిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదే విషయమై సోమవారం తాజాగా పోలీసులు తాళ్ళరాంపూర్ వెళ్ళి విచారణ నిమిత్తం గ్రామకమిటీకి చెందిన సభ్యులను పిలిపించారు. తాము గౌడ కుల సంఘానికి చెందిన మహిళలను పూజకు అడ్డగించలేదని, అవన్నీ ఆరోపణలని ఖండిస్తూ.. గ్రామస్తులంతా ఒక్కసారిగా తాళ్ళరాంపూర్ నుండి ఏర్గట్ల పోలీస్ స్టేషన్‌కు పాదయాత్రగా తరలిరావడంతో ఉద్రిక్త వాతావరణం చోటుచేసుకుంది. ఇదే విషయమై తాళ్ళ రాంపూర్ మహిళలు మాట్లాడుతూ.. గ్రామ కమిటీ వారు గౌడ కుల సంఘం మహిళలను పూజను అడ్డగించలేదని, వారిపై కేసులు చేయడం సరికాదని అన్నారు. అనంతరం గ్రామస్తులకు సిఐ సర్దిచెప్పడంతో అక్కడి నుంచి గ్రామస్తులంతా వెళ్ళిపోవడంతో ఒక్కసారిగా శాంతియుత వాతావరణం నెలకొంది. దీంతో వివాదం సద్దుమణిగింది.

ప్రసవానంతరం క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలి

- ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ ఫరీదా
- కామారెడ్డి ప్రభుత్వాస్పత్రిలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం


మాట్లాడుతున్న అధికారులు

నవతెలంగాణ-కామారెడ్డి

మహిళలు ప్రసవానంతరం పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలని జీజీహెచ్ సూపరింటెండెంట్ ఫరీదా బేగం అన్నారు. సోమవారం ప్రభుత్వ ఆసుపత్రిలో కామారెడ్డి ఐఎంఏ ఐఎంఈ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం 2025 ఉద్దేశ్యాన్ని వివరించారు. అనంతరం ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ ఫరీదా బేగం మాట్లాడుతూ.. ప్రసవానంతర పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవడం, పోషకాహారంతో కూడిన కూరగాయలు తీసుకోవడం, ఐరన్, ఫోలిక్ యాసిడ్ మందులు క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల మాతాశిశుమరణాలను అరికట్టవచ్చని వివరించారు. ప్రభుత్వాసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ వెంకట్ మాట్లాడుతూ.. తల్లీబిడ్డల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ వైద్యులు, సిబ్బంది ఎంతో కృషి చేస్తున్నారన్నారు. తల్లులు క్రమం తప్పకుండా ప్రసవానికి ప్రభుత్వాసుపత్రికి రావాలని, షెడ్యూల్ ప్రకారం పిల్లలకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని సూచించారు. తెలంగాణ శిశు మరణాల రేటు 2014లో 39 నుంచి 2020 నాటికి 21కి తగ్గిందని ఐఎంఏ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అరవింద్ అన్నారు. ఇన్‌ఫెక్షన్లను నివారించడానికి పిల్లలకు తల్లిపాలు, క్రమం తప్పకుండా టీకాలు వేయడం ప్రాముఖ్యతపై ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో డా.కల్యాణి శ్రీనివాస్, డాక్టర్ యాదగిరి, డిఎంఓ, ఐఎంఏ కోశాధికారి డాక్టర్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

వీడీసీ ఆగడాలను అరికట్టాలి

వారికే వత్తాసు పలుకుతున్న ప్రభుత్వం

- గ్రామాభివృద్ధి కమిటీలపై చర్యలు తీసుకోవాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి ఎ.రమేష్ బాబు


మాట్లాడుతున్న సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు

నవతెలంగాణ-ఆర్మూర్

గ్రామాభివృద్ధి కమిటీలపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి రమేష్‌బాబు డిమాండ్ చేశారు. పట్టణంలోని శాస్త్రీనగర్‌లో గల సీపీఐ(ఎం) కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన రమేష్‌బాబు మాట్లాడుతూ.. నిజామాబాద్ జిల్లాలో గ్రామాభివృద్ధి కమిటీల ఆగడాలు రోజురోజుకూ పెరుగుతుంటే వీటిని అరికట్టాలని గతంలో అనేకసార్లు సీపీఐ(ఎం), ప్రజాసంఘాలుగా అధికారులకు విన్నవించినప్పటికీ వాటిని అరికట్టడంలో గత ప్రభుత్వాలు విఫలమయ్యాయని తెలిపారు. గత ప్రభుత్వాలు, ఈ ప్రభుత్వం నేటికి గ్రామాభివృద్ధి కమిటీలకు వత్తాసు పలకడంతో గ్రామాభివృద్ధి కమిటీలు మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతున్నాయన్నారు. శ్రీరామనవమి సందర్భంగా గౌడ మహిళలను గుడికి వెళ్లకుండా బహిష్కరించారని పేర్కొన్నారు. ఈ రకంగా బలహీన వర్గాల ప్రజలపై పెత్తనం కొనసాగిస్తూ ప్రజల మద్దతుతో ఎన్నికైన ప్రజాప్రతినిధులను సైతం లెక్కచేయకుండా గ్రామ అభివృద్ధి కమిటీలకు ప్రభుత్వం వత్తాసు పలకడం శోచనీయమని అన్నారు. ఇప్పటికైనా గ్రామాభివృద్ధి కమిటీలను రద్దు చేయాలని, వారి మీద కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తిమ్మాపూర్ గ్రామాభివృద్ధి కమిటీలపైన ఎవరైతే నాయకత్వం వహిస్తున్నారో వాళ్ళందరిపై ఎస్సీ, ఎస్టీ, అట్రాసిటీ కేసు నమోదు చేసి బీసీల మీద పెట్టిన గ్రామాభివృద్ధి కమిటీ నిషేధాన్ని ఎత్తివేయాలని, లేకపోతే అన్ని వర్గాలకు వర్తింపచేసే అవకాశం ఉందని అన్నారు. ఈ సమావేశంలో సీపీఐ(ఎం) డివిజన్ కార్యదర్శి పల్లపు వెంకటేష్, సీపీఐ(ఎం) జిల్లా సెక్రటేరియట్ మెంబర్ నూర్జహాన్, డివిజన్ కమిటీ సభ్యులు ఇడగొట్టి సాయిలు, సీపీఐ(ఎం) నాయకులు కుల్దీప్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో ఉచిత అంబలి పంపిణీని ప్రారంభించిన కలెక్టర్



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీఓ) జిల్లా శాఖ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం (కలెక్టరేట్)లో నెలకొల్పిన ఉచిత అంబలి పంపిణీ కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. చల్లని తాగునీటితో పాటు ఉచితంగా అంబలి పంపిణీకి చొరవ చూపడం అభినందనీయమని టీఎన్జీఓ సంఘాన్ని అభినందించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తూ, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడం గొప్ప విషయమని తెలిపారు. కలెక్టరేట్ ఉద్యోగులతో పాటు వివిధ పనుల కోసం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయానికి వచ్చే వారికి ప్రస్తుత వేసవిలో అంబలి కేంద్రం ఎంతో ఉపశమనాన్ని అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు సుమన్, కార్యదర్శి శేఖర్, రాష్ట్ర నాయకుడు గైని గంగారాం తదితరులు పాల్గొన్నారు.

9మంది పేకాట రాయుళ్ల అరెస్ట్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని అమృతపూర్ గ్రామ శివారులో పేకాటాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు పేకట స్థావరంపై దాడి చేసి 9 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ మోహమ్మద్ షరీఫ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అమృతపూర్ శివారులో పేకాటాడుతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ.2,330 నగదు, 8 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

డంపింగ్ యార్డ్‌తో దుర్వాసన

- అనారోగ్యం బారిన పడుతున్నామని ఆవేదన
- చెత్త బండ్లను నిలిపివేసి కాలనీవాసుల నిరసన
- సీపీఐ(ఎం) మద్దతు.. కలెక్టరేట్‌లో ఫిర్యాదు


నిరసన వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు


నిలిచిన చెత్త వాహనాలు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నాగారంలోని 300 క్వార్టర్స్ వద్ద ఆదివారం రాత్రి డంపింగ్ యార్డులో నిప్పులు చెలరేగడంతో స్థానిక ప్రజలు పొగ, దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దాంతో స్థానిక కమిటీ సభ్యులు, ప్రజలు సోమవారం ఉదయం చెత్త బండ్లను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నిరసనకు సీపీఐ(ఎం) మద్దతుగా నిలిచింది. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నగర కార్యదర్శి సుజాత మాట్లాడుతూ.. డంపింగ్ యార్డ్ వాసనతో చాలామంది అనారోగ్యాల పాలవుతున్నారని వివరించారు. ఇప్పటికే చాలాసార్లు గతంలో ఎంపీలకు, ఎమ్మెల్యేలకు వినతులు ఇచ్చామని తెలిపారు. దాదాపు 40 రోజుల పాటు నిరసనలు చేశామ వివరించారు. ఎన్నికల ముందు హామీలు ఇచ్చి.. తాము ఎన్నికల్లో గెలిస్తే డంపింగ్‌యార్డు సమస్యను పరిష్కరిస్తామంటున్నా.. ఇప్పటివరకు ఏ నాయకులు కూడా ఆ సమస్యను పరిష్కరించలేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారమయ్యేలా చూడాలని కోరారు. లేదంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేస్తామని సుజాత ప్రభుత్వాన్ని హెచ్చరించారు. స్థానికులు నిరసన చేపట్టడంతో మున్సిపల్ కమిషనర్ దిలీప్‌కుమార్ కదిలి వచ్చారు. సమస్యను పరిష్కరిస్తామని కాలనీవాసులకు సూచించారు. అనంతరం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో కలెక్టర్ ఆఫీస్‌లో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో డెవలప్మెంట్ కమిటీ సభ్యులు గంగాధర్, జి.బాలకృష్ణ, జై శ్రీధర్, జి.సంతోష్, రాజమణి, ఎం.సుగుణ, గంగామని, పద్మ, యమునా, లలిత తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సౌకర్యాల్లేవ్

- రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసన


నిరసన వ్యక్తం చేస్తున్న అసోసియేషన్ కమిటీ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

రిజిస్ట్రేషన్ కార్యాలయంలో తగిన సౌకర్యాలు లేవని ఆర్ఆర్ చౌరస్తా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ అధ్యక్షులు జిల్లాల రమేష్, ప్రధాన కార్యదర్శి పశుల నర్సింగరావు అన్నారు. ఆర్ఆర్ చౌరస్తా రియల్ ఎస్టేట్ అసోసియేషన్ నిజామాబాద్ నగర కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిజామాబాద్ నగరంలోని రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తగిన సౌకర్యాలు లేనందున అక్కడ సౌకర్యాలు కల్పించాలని అన్నారు. డాటా ఎంట్రీలో ఏవైనా పొరపాట్లు జరిగితే వాటిని సరిదిద్దేందుకు డిఆర్‌కు సవరణ దరఖాస్తు పెడితే వాటిని సరిచేయడానికి ఆలస్యం అవుతుందన్నారు. తద్వారా లక్షలాది లావాదేవీలు నిలిచిపోతున్నాయని చెప్పారు. సామాన్య ప్రజలు వారి అవసరాలకు విక్రయించుకున్న ఆస్తి తాలూకు డబ్బులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నాన్ లేఔట్ ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయాలని 20 గుంటల భూమి ఉన్నదానికి లేఔట్ ఫీజు తీసుకొని ప్లాట్ల రూపంలో రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలని అన్నారు. నిత్యం అనేక రిజిస్ట్రేషన్లు జరుగుతున్నాయని, ఈ రిజిస్ట్రేషన్ కోసం వచ్చిన ప్రజలు కూర్చోవడానికి కుర్చీలు లేవని తెలిపారు. ఉన్న కొద్దిపాటి కుర్చీలు ఏ పాటికి సరిపోవడం లేదన్నారు. మంచినీటి సమస్య ఉందని, ఈ సమస్య వేసవికాలంలో మరింత ఎక్కువగా ఉంటుందన్నారు. రిజిస్ట్రేషన్ కోసం వచ్చేవారికి మరుగుదొడ్లు, బాత్రూంలో సౌకర్యం లేదని, దీంతో మహిళలు ఎన్నో అవస్థలకు గురవుతున్నారని ఉన్నవాటిని శుభ్రంగా ఉంచాలని కోరారు. అనంతరం రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన డీఐజీకి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కోశాధికారి రమణగౌడ్, కార్యవర్గ సభ్యులు రాజు, ప్రవీణ్, వినోద్, శ్యామ్, అగ్గు సంతోష్, తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

గిరిజన నాయకుల అరెస్టు దుర్మార్గం

- తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతీరాం నాయక్


అరెస్టయిన నాయకులు

నవతెలంగాణ-కామారెడ్డి

గత ప్రభుత్వం గిరిజనుల కోసం 2020-21లో విడుదలైన రూ.219 కోట్లు, ట్రైక రుణాలను రద్దు చేయకుండా వెంటనే విడుదల చేయాలని కోరుతూ సోమవారం చేపట్టిన గిరిజన భవన్ ముట్టడి కార్యక్రమానికి ముందే ఎక్కడికక్కడ గిరిజన నాయకులను పోలీసులు అరెస్టు చేయడం దుర్మార్గమైన చర్య అని తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతీరాం నాయక్ అన్నారు. గిరిజన భవన్ ముట్టడి కార్యక్రమానికి వెళ్లేందుకు సిద్ధమైన గిరిజన నాయకులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోతీరాం నాయక్, గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు వినోద్ నాయక్‌ను కామారెడ్డి పోలీసులు ముందస్తు అరెస్టు చేసి కామారెడ్డి పట్టణంలోని దేవునిపల్లి పోలీస్ స్టేషన్లలో ఉంచారు. ఈ సందర్భంగా మోతీరాం నాయక్ మాట్లాడుతూ.. రూ.219 కోట్లు ట్రైకా రుణాలను వెంటనే విడుదల చేయాలన్నారు. 2020-21 సంవత్సరాల్లో దాదాపు జిల్లాలో 3 వేలకు పైన యువతీ యువకులను ఎంపిక చేశారని తెలిపారు. వారికి ప్రభుత్వం చెక్కులు కూడా పాస్ చేసిందని, గత ప్రభుత్వం బడ్జెట్ ఇవ్వకపోవడం వల్ల వాయిదా పడుతూ వచ్చిందన్నారు. ప్రస్తుతం ఈ ప్రభుత్వం ఆ చెక్కులను రద్దు చేస్తూ కొత్త ఉత్తర్వు ఇచ్చిందని పేర్కొన్నారు. కొత్త వాళ్ళను ఎంపిక చేయడం కోసం ప్రయత్నం జరుగుతుందని, దానిని అడ్డుకునేందుకు సోమవారం గిరిజన సంఘం ఆధ్వర్యంలో గిరిజన భవన్ ముట్టడి ఉందని, అందుకనే సోమవారం ఉదయం నుంచి గిరిజన నాయకులను పోలీసులు అరెస్టు చేశారని తెలిపారు. ఈ అరెస్టులను మేధావులు, వివిధ సంఘాల నాయకులు ఖండించాలని కోరారు.

వ్యవసాయ బోరు మోటర్ల కేబుల్ వైర్లు చోరీ

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండల కేంద్రంలో వ్యవసాయ క్షేత్రాల్లో రైతుల వ్యవసాయ బోరు బావులకు సంబంధించిన కేబుల్ వైర్లు, ఫీజులు, స్టార్టర్లను దుండగులు ఆదివారం రాత్రి అపహరించుకు వెళ్ళినట్లు రైతులు తెలిపారు. ఆలూర్‌లో రైతులు నడికుడ గంగారెడ్డి, నడికుడ నర్సారెడ్డి,ముస్కు శ్రీకాంత్, సింగిడి లింగారెడ్డి,నడికుడ రవి వ్యవసాయ బోరుబావుల వద్ద వారి వ్యవసాయ క్షేత్రాల్లో కేబుల్ వైర్లను, స్టార్టర్లను, ఫీజులను గుర్తు తెలియని దుండగులు ఎత్తుకెళ్లి అపార నష్టం కలిగించారని లబోదిబోమంటున్నారు. తరచూ దుండగులు వ్యవసాయ క్షేత్రంలోని బోరుబావుల వద్ద నుంచి స్టార్టర్ డబ్బాలోని వస్తువులతో పాటు, కేబుల్ వైర్లను ఎత్తుకెళ్లి అపార నష్టం కలిగించడం వల్ల, పంటలకు సైతం నీరు అందించలేక పోతున్నామని రైతులు మొరపెట్టుకుంటున్నారు. ఈ విషయమై ఆర్మూర్ పోలీసులు దృష్టి చారించి దుండగులను పట్టుకొని రైతుల బాధలను తీర్చాలని కోరారు.

55 గ్రాముల గంజాయి పట్టివేత

- ఒకరి అరెస్టు

నవతెలంగాణ-కంఠేశ్వర్

నగరంలోని మూడవ పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి అమ్ముతున్న ఓ యువకుడిని అరెస్టు చేసి 55 గ్రాముల గంజాయిని పట్టుకున్నట్లు మూడవ పోలీస్ స్టేషన్ ఎస్ఐ హరిబాబు సోమవారం తెలిపారు. నమ్మకమైన సమాచారం మేరకు సోమవారం మధ్యాహ్నం సమయంలో దుబ్బ, గుర్బాబాది రోడ్, కృష్ణ మందిర్ దగ్గరలో గంజాయి అమ్ముతున్నారు అనే సమాచారం మేరకు 3వ టౌన్ పోలీస్ వారు వెళ్లి గంజాయి అమ్ముతున్న బీహార్ రాష్ట్రం, ఖగారియా మండల్, జిల్లా, బధాస్ నార్త్‌కు చెందిన పునీత్ కుమార్ పట్టుకున్నట్లు ఎస్సై తెలిపారు. తన వద్ద 55 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నేరస్తుడు గంజాయిని ఖగారియా జిల్లా, బీహార్ రాష్ట్రం నుండి తీసుకొని వచ్చానని చెప్పగా కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలిస్తున్నామన్నారు.

బార్ ఎన్నికల నామినేషన్లు



నామినేషన్లు వేస్తున్న జెస్సు అనిల్‌కుమార్

నవతెలంగాణ-ఆర్మూర్

2025 - 26 సంవత్సరానికి గాను నిర్వహిస్తున్న న్యాయవాదుల బార్ ఎన్నికల నామినేషన్ లో భాగంగా సోమవారం ప్రధాన కార్యదర్శి పదవికి జెస్సు అనిల్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ నామినేషన్ ను ఎన్నికల అధికారులైన సిరియాల జగన్, కొత్తపల్లి రాములు కు అందజేశారు. కార్యక్రమంలో న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

స్వాములకు భిక్ష ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే

- భారీగా హాజరైన స్వాములు
- భక్తి భజన పాటలకు చిందేసిన ఎమ్మెల్యే వేముల


స్వాములకు భిక్ష అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

వేల్పూర్ జంబి హనుమాన్ వద్ద సోమవారం బాల్కొండ నియోజకవర్గంలోని ఆంజనేయ స్వామీ మాల ధారణ వేసుకున్న స్వాములకు మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి ఏర్పాటు భిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ భిక్షలో నియోజకవర్గంలోని స్వాములు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి సతీ సమేతంగా పాల్గొన్నారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన భజన బృందం సభ్యులు భక్తి పాటలతో అలరించారు. మాలధారణ స్వాములతో కలిసి భక్తి భజన పాటలకు కాసేపు ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి చిందేశారు. స్వాములకు భిక్షను ఎమ్మెల్యే స్వయంగా అందించారు.

మా భూమి రథయాత్ర కరపత్రాలు ఆవిష్కరణ


కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ధర్మ సమాజ్ పార్టీ నాయకులు

నవతెలంగాణ-బాల్కొండ

ఆదిలాబాద్ జిల్లాలో ఈనెల 14న ప్రారంభమయ్యే లక్ష కిలో మీటర్ల మా భూమి రథయాత్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ధర్మ సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు మహిపాల్ అన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, జేఏసీ, ధర్మ సమాజ్ పార్టీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ రథయాత్రకు సంబంధించిన కరపత్రాలను సోమవారం బాల్కొండ కేంద్రంలో ఆవిష్కరించి మాట్లాడారు. ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు డా.విశారదన్ మహారాజు చేపట్టిన ఈ లక్ష కిలోమీటర్ల రథ యాత్రలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. తెలంగాణలో 90 శాతం ఉన్న బీసీ, ఎస్సీ ఎస్టీ అణగారిన వర్గాల ప్రజలకు రాజకీయ చైతన్యాన్ని కలిగించి రాజ్యాధికారాన్ని స్థాపించడమే ధ్యేయంగా ధర్మ సమాజ్ పార్టీ పనిచేస్తుందని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు మురళి,మండల అధ్యక్షులు నిశాంత్, మండల నాయకులు ఆత్మ గౌరవ్, క్రాంతి కిరణ్, అన్వేష్ రంజిత్,రాజు పాల్గొన్నారు.

బీసీల రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలి

- బీసీ హక్కుల సాధన సమితి

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బీసీ హక్కుల సాధన సమితి సభ్యత్వ నమోదును సిపిఐ జిల్లా కార్యాలయంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి పి.సుధాకర్ మాట్లాడుతూ దేశంలో సగభాగం ఉన్న బిసిల అభివృద్ధి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేయాలని అన్నారు. ఈ మధ్య జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో ప్రవేశపెట్టిన 42శాతం బీసీలకు రిజర్వేషన్లను కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని అన్నారు. దేశంలో కులగణన చేపట్టి అధిక జనాభా ఉన్న బిసి కులాల, ఉపకులాల వారికి అన్ని రంగాల్లో హక్కులు రిజర్వేషన్లు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి వై.ఓమయ్య సిపిఐ జిల్లా నాయకులు కే.రాజన్న బీసీ హక్కుల సాధన సమితి సభ్యులు టి.చక్రపాణి, పి.హనుమండ్లు, కండ్లకోయ గంగాధర్, సాయినాథ్, ప్రకాష్, ఆనంద్ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 3 రోజులు జైలు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ఇందల్ వాయి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన వ్యక్తి లావుడ్య రాజు వెంగల్‌పాడ్‌ను సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ (ఎక్సైజ్ కోర్టు నిజామాబాద్) ముందు హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ అహ్మద్ మొయినుద్దీన్ 3 రోజులు జైలు శిక్ష విధించినట్లు ఇందల్ వాయి ఎస్‌హెచ్ఓ మనోజ్ కుమార్ తెలిపారు.

మానసిక ఒత్తిడితోనే వ్యాధులు

- ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

'ప్రతి ఒక్కరూ మంచి ఆరోగ్యకరమైన అలవాట్లతో ప్రతిరోజు వ్యాయామం చేయాలని, మానసిక ఒత్తిడి నుండి దూరం అవ్వాలని, మానసిక ఒత్తిడి అధికమైతే హైపర్ టెన్షన్, డయాబెటిక్ లాంటి వ్యాధులు రావడానికి అవకాశం ఉందని మండల ఆరోగ్య విస్తరణ అధికారి వై శంకర్ పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఇందల్ వాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన సమావేశంలో ఆరోగ్య విస్తరణ అధికారి వై.శంకర్ మాట్లాడుతూ ఈ సంవత్సరం 2025 థీం 'నేడు తీసుకునే ఆరోగ్య నిర్ణయాలే రేపటి జీవననాణ్యతను నిర్దేశిస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ మానసిక ఒత్తిడి నుండి దూరం


అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య విస్తరణ అధికారి

అవ్వాలని మానసిక ఒత్తి డి అధికమైనట్లయితే హైపర్ టెన్షన్, డయాబెటిక్ లాంటి వ్యాధులు రావడానికి అవకాశం ఎక్కువగా ఉంటుందని అన్నారు. గుండె సంబంధిత వ్యాధులు, క్యాన్సర్,. ఊపిరితి త్తుల వ్యాధు లు, మధుమేహం, అసంక్రమిక వ్యాధుల ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా జరిగే మొత్తం మరణాల్లో సుమారు 74శాతం అసంక్రమిక వ్యాధుల వల్లనే జరుగుతున్నాయని చెప్పారు. అధిక బరువు, ధూమపానం, మద్యం, ఫాస్ట్ ఫుడ్ వినియోగం, వ్యాయామ లేకపోవడం కారణమన్నారు.

జీవనశైలిలో మార్పులు చేసుకోవడం ద్వారా 80శాతం వరకు ఈ వ్యాధులను నివారించవచ్చని తెలిపారు. ఉదాహరణకు, సత్వర ఆహారం తగ్గించడం, ఫిజికల్ యాక్టివిటీ పెంచడం, ధూమపానం మానడం వంటివి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు స్వర్ణ లత, భానుప్రియ, ఇందిరా, స్వరూప, విజయ, ఆనంద్, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

జాగ్రతలు పాటిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందాం..

- మెడికవర్ హాస్పిటల్స్ వైద్య బృందం

నవతెలంగాణ-కంఠేశ్వర్

జాగ్రతలు పాటిద్దాం.. ఆరోగ్యాన్ని కాపాడుకుందామని మెడికవర్ హాస్పిటల్స్ వైద్యులు అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం మెడికవర్ హాస్పిటల్ వైద్య బృందం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈసందర్భంగా వైద్యులు మాట్లాడుతూ.. ఆధునిక జీవన శైలిలో సౌకర్యాలతో పాటు సమస్యలను కూడా పెంచుకుంటున్నామని, ఆహారపు అలవాట్లు, కూర్చున్న చోటే అన్ని పనులు జరగడం, చాలీ చాలని నిద్ర వీటన్నింటి కారణంగా అనారోగ్యాల బారిన పడుతున్నామని అన్నారు. సహజ సిద్ధమైన ఆహారాలు, సంప్రదాయక వంటలు పూర్తిగా కనుమరుగు అయిపోయాయన్నారు. ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, బేకరీ ఐటమ్స్ నేటి సమాజం బాగా అలవాటు పడిపోతుందని, అంతే కాదు సమయానికి తినడం దాదాపు మర్చిపోయామనే చెప్పొచ్చన్నారు. వేళా పాళా లేకుండా ఎప్పుడు పడితే అప్పుడు, ఎక్కడ పడితే అక్కడ ఏది పడితే అది తినేస్తున్నామని, గాడి తప్పిన మన జీవనశైలి, అదుపు తప్పిన ఆహారపు అలవాట్లు, ఒత్తిడి కారణంగా డయాబెటీస్, హై బీపీ (రక్తపోటు), గుండె జబ్బులు, ఊబకాయం వంటి అనేక జబ్బుల బారిన పడుతున్నామని అన్నారు. తెల్లవారుజామునే నిద్రలేవడం, రాత్రి త్వరగా పడుకోవడం, రోజంతా ఒళ్లు వంచి పనులు చేసుకోవటం సహజసిద్ధంగా పండే కూరగాయలు, పండ్లు, తృణధాన్యాలను తినడం. ఆరుబయట గాలిని పీలుస్తుండటం, స్వచ్ఛమైన నీటిని తాగుతూ ప్రశాంతంగా బతకడం. ఇది ఒకప్పటి జీవన శైలి అని అన్నారు. ఫాస్ట్ ఫుడ్స్, జంక్ ఫుడ్స్, బేకరీ ఐటమ్స్‌కు నేటి బాగా అలవాటు పడి సమయానికి తినడం మర్చిపోయామని తెలిపారు. ఏసి, సెల్ ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, కంప్యూటర్లు వంటి ఎలక్ట్రానిక్ గాడ్జెట్‌ల వాడకం. వ్యాయామం లేకపోవడం, మానసిక అలసట, ఒత్తిడి ఆందోళన రూపంలో మన ఆరోగ్యాన్ని నాశనం చేస్తోందన్నారు. ఎక్కువసేపు


అవగాహన కల్పిస్తున్న వైద్యులు

కూర్చోవడం గుండె జబ్బులు, మెదడు స్ట్రోక్‌లకు దారితీస్తోందని తెలిపారు. ఇప్పుడు చాలా మంది ఇంటర్నెట్ నుండి సూచనలు తీసుకోవడం అనేది ట్రెండింగ్‌లో ఉందని, దీని వల్ల స్వయంగా డాక్టర్లను సంప్రదించకుండా వారే మెడిసిన్స్ వాడటం ప్రమాదకరంగా, తరువాత దశలో ప్రాణాంతకం కావచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రశాంత్, డాక్టర్ అజయ్ పాటిల్, డాక్టర్ దత్తు రాజు, డాక్టర్ యజ్ఞా అసిస్టెంట్ మెడికల్ సూపర్ ఇండెంట్, సెంటర్ హెడ్ స్వామి మార్కెటింగ్ హెడ్ వినయ్ కుమార్ పాల్గొన్నారు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

- కాంగ్రెస్ మండలాధ్యక్షులు మోత్కూరి నవీన్‌గౌడ్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

ప్రభుత్వం సహకార సొసైటీలు, ఐకెపి మహిళా సంఘాలు, డిసిఎంఎస్‌లో ద్వారా నెలకొల్పిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకుని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న వడ్లకు అందజేస్తున్న ఐదు వందల రూపాయల బోనస్ పొందాలని కాంగ్రెస్ పార్టీ ఇందల్‌వాయి మండల అధ్యక్షులు మోత్కురి నవీన్‌గౌడ్ అన్నారు. సోమవారం ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పలువురితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏ రాష్ట్రం లో లేని విధంగా రైతులను ఆదుకోవాలనే కృతనిశ్చయంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉచిత విద్యుత్, రెండు లక్షల రూపాయల రూణమఫీ, రైతు బంధు,


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మండల అధ్యక్షులు

సన్నవడ్లకు ఐదొందల రూపాయల బోనస్ నేరుగా రైతుల ఖాతాల్లోకి జామ చేస్తున్నారని వివరించారు. గతంలో పాలించిన వారు రైతు సంక్షేమం మరిచిపోయారని , కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన హామీలను నేరవేర్చుతుందని పేర్కొన్నారు. అంతకు ముందు ఇందల్‌వాయి మండలంలోని లోలం,అమ్సన్ పల్లి, గుట్ట కింది తండా, సంస్థాన్ సిర్నాపల్లి గ్రామాల్లో ఐకెపి ద్వారా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో డిసిసి డెలిగేట్ టి సుధాకర్, ఎపిఎం సువర్ణ ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు చిన్ రెడ్డి సంతోష్ రెడ్డి, సీనియర్ నాయకులు గుట్ట గంగాదర్, కాంట్రాక్టర్ సంతోష్ రెడ్డి, మహిపాల్ నాయక్, రెడ్డి బైరయ్య, ఏఈవో ప్రశాంత్, సిసిలు అనురాధ, ఉదయ్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లిలో...

డిచ్‌పల్లి మండలం లోని నడిపల్లి, సుద్ద పల్లి గ్రామాల్లో ఐకెపి మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసిల్దార్ ప్రభాకర్ పలువురితో కలిసి ప్రారంభించారు.ఈ కార్యక్రమం లో ఎఎంసి డైరెక్టర్ దేవకరుణ, ఏపిఎం రాణి శ్రీ, రెవెన్యూ ఇన్స్పెక్టర్ సంతోష్,అధ్యక్షులురాలు రజిత,కె సురేష్, పరిష్ సంసాల గంగాదేవి. బి భారతి, మాజీ సర్పంచ్ సతీష్, తోపాటు తదితరులు పాల్గొన్నారు.

శౌచాలయాలు ప్రారంభం


మొక్కలు నాటుతున్న రోటరీ క్లబ్ సభ్యులు

నవతెలంగాణ-మాక్లూర్

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గుత్పలో సోమవారం రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన బాలికల శౌచాలయాలు హ్యాండ్ వాష్ స్టేషనులను ప్రారంభించినట్లు క్లబ్ అధ్యక్షులు బిరెల్లి విజయ రావు తెలిపారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ.. రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్, నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్, గుత్ప గ్రామ సేవా కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో అత్యాధునిక హంగులతో నిర్మించిన బాలికల శౌచాలయాలు, హ్యాండ్ వాష్ స్టేషన్లను ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమానికి అతిథిగా నిజామాబాద్ రోటరీ సర్వీస్ ట్రస్ట్ చైర్మన్ వి. ప్రకాష్‌మిట్టల్, ప్రత్యేక అతిథిలుగా ఆలూరు ఎంపీడీవో గంగాధర్, ఆలూరు ఎంఈఓ నరేందర్, మాక్లూర్ ఎంఈఓ సత్యనారాయణ హాజరై శౌచాలయాలను ప్రారంభించారు. మొదటగా వేద ప్రకాష్ మిట్టల్ శిలాఫలకం ఆవిష్కరింపజేసి అనంతరం షోచాలాయ భవనాలను ఆవిష్కరించారు. తదనంతరం మొక్కలను నాటారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ దాదాపు 3.5 లక్షలకు పైగా వెచ్చించి నూతన షోచాలాయ నిర్మాణం అత్యాధునిక హంగులతో ఏర్పాటు చేశారని రోటరీ క్లబ్ వారికి అభినందనలు తెలిపారు. దీనికి రోటరీ క్లబ్ ఆఫ్ నిజామాబాద్ కార్యదర్శి రేకులపల్లి గంగారెడ్డి యొక్క కృషి ఫలితమే అని కొనియాడారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు పి.శ్రీనివాసరావు, భరత్ పటేల్, జ్ఞాన ప్రకాష్, బాబురావు, పార్సిరాజేశ్వర్, నర్సింగ్ రావు, డీఈఓ ప్రతినిధులు శ్రీధర్ రెడ్డి, ఆర్గనైజర్ ఓడ్డేనా, అనిల్, గ్రామ కమిటీ సభ్యులు, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్, హెచ్ఎం ధృపతి కుమార్, సిబ్బంది ,విద్యార్థులు పాల్గొన్నారు.

ఆపరేషన్ కగార్ ఆపాలని నేడు చలో హైదరాబాద్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని ఈనెల 8న చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని న్యూడెమోక్రసీ జిల్లా సహాయ కార్యదర్శి దాసు పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలోని ఆదర్శనగర్ కాలనీలో సోమవారం పోస్టర్స్ ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామిక హక్కులను కాలరాసి ఆదివాసులపై ఏకపక్ష దాడిని కొనసాగించడాన్ని న్యూ డెమోక్రసీ తీవ్రంగా వ్యతిరేకిస్తూ, ఆపరేషన్ కగార్‌కు వ్యతిరేకంగా మంగళవారం హైదరాబాదు లో ఇందిరా పార్క్ వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆపరేషన్ కగార్ పేరుతో ప్రకృతి సంపదను కార్పొరేట్ కంపెనీలకు కారుచౌకగా కట్టబెట్టేందుకే చతిస్గడ్ రాష్ట్రంలో ఆదివాసులనుభయభ్రాంతులకు గురిచేస్తుందని ఆయన అన్నారు. .మధ్య భారత దేశంలో ఆదివాసి ప్రాంతాల్లో ఉన్న ఖనిజ సంపదను అంబానీ, ఆదాని లాంటి పెద్ద మనుషులకు అప్పజెప్పడానికి, ప్రభుత్వ మిలిటరీనీ దించి, ప్రజా ప్రతిఘటనను అణిచి వేసే ప్రయత్నం చేస్తుందని ఆయన అన్నారు. నక్సలైట్ల ఏరివేత పేరుతో ఆదివాసుల జీవించే హక్కుని నిరాకరిస్తోందని తెలిపారు. ఆపరేషన్ కగార్‌ను నిలుపుదల చేయాలని, ప్రభుత్వ మిలటరీని వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.ఎ న్యూ డెమోక్రసీ సబ్ డివిజన్ కార్యదర్శి శివాజీ, అరుణోదయ జిల్లా అధ్యక్షులు సురేష్ బాబు లు మాట్లాడుతూ నరేంద్ర మోడీ ప్రభుత్వం ఆపరేషన్ కగార్ పేరుతో ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తుందని అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మోడీ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా అసెంబ్లీలో తీర్మానం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఎస్ రవి, బి.ప్రిన్స్ ,అలీమ్ భాయ్, కాజా పటేల్, లోకేష్, భాషా, లతీఫ్, వర్ణారెడ్డి, గౌస్, ఇన్నా, సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

లక్కోరలో గోదాం నిర్మాణానికి శంకుస్థాపన

నవతెలంగాణ-(వేల్పూర్)ఆర్మూర్

మండలంలోని లక్కోర గ్రామంలో 100 మెట్రిక్ టన్నుల గోదాం కు 9 లక్షల రూపాయల వ్యయం తో నిర్మాణానికి జిల్లా డిసిసిబి చైర్మన్ కుంట రమేష్ రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. దీన్ని తొమ్మిది లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్నారు. కార్యక్రమంలో డిసిసిబి డైరెక్టర్లు భుమన్న శంకర్ సొసైటి వైస్ చైర్మన్ భైరిశ్రీదర్, సొసైటి డైరెక్టర్లు లక్కోర గ్రామ వీడీసీ సభ్యులు రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గురుకుల ఫలితాల్లో మెరిసిన బస్సాపూర్ ఆణిముత్యాలు

నవతెలంగాణ-బాల్కొండ



టీజీ గురుకుల సెట్‌లో నిజామాబాద్ జిల్లా బాల్కొండ మండలం బస్సాపూర్ గ్రామ ప్రాథమిక పాఠశాల నుంచి 12 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయగా 9 మంది విద్యార్థులు అర్హత సాధించినట్లు సోమవారం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.రాజారాం తెలిపారు. అర్హత సాధించిన హర్షిత్, సాత్విక్, మనీత్, కార్తికేయ, శ్రీహితేష్, వర్షిత్, నిత్యశ్రీ, మధుప్రియ, నిహితలను ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

గురుకులాల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

- అదనపు కలెక్టర్‌కు పీడీఎస్‌యూ వినతి



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

బాసర జోన్-2 పరిధిలో నిజామాబాద్ జిల్లాలోని కంజర, ధర్మారం (బి) పాఠశాలల్లో కంప్యూటర్ టీచర్ల (ఐసీటి) అక్రమ నియామకాలపై, జోనల్ ఆఫీస్ కేంద్రంగా డిప్యూటేషన్ లో వచ్చిన ఔట్‌సోర్సింగ్ డీఈవో (డాటా ఎంట్రీ ఆపరేటర్) రంజిత్ అవినీతిపై విచారణ చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యు జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ కర్క గణేష్ మాట్లాడుతూ.. గత నవంబర్ 2024 లో ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ టీచర్ల డిప్యూటేషన్ రద్దయినా కూడా కంజర పాఠశాలలో కంప్యూటర్ టీచర్ నాగరాజుని ఔట్ సోర్సింగ్ నుండి హానరోరియంలోకి మార్చి విద్యార్థులకు తీవ్రనష్టం చేస్తున్నారన్నారు. సంవత్సరం పైగా పాఠశాలకి గైర్హాజరు కావడం, ఒకవేళ వచ్చినా విద్యార్థులకు కంప్యూటర్ క్లాసులు బోధించకపోయినా సంవత్సరం తరువాత మళ్ళీ అదే పాఠశాలలో డిప్యూటేషన్ ఇచ్చారన్నారు. డిప్యుటేషన్ అనుమతి ఇచ్చిన ప్రిన్సిపల్ పైన, అధికారులపైన కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల డిప్యూటేషన్ రద్దు అయినప్పటికీ నాగరాజును పనిచేసే పాఠశాలకు పంపించకుండా, మళ్లీ అదే కంజర పాఠశాలలో ఔట్ సోర్సింగ్ నుండి హానరోరియంకి మార్చి, నిబంధనలకు విరుద్ధంగా పనిచేయడానికి అనుమతి ఎందుకు ఇచ్చారన్నారు. దీనికి సహకరించిన బాన్సువాడ గురుకుల పాఠశాల నుంచి డిప్యూటేషన్‌లో జోనల్ ఆఫీస్‌లో పనిచేస్తున్న డీఈఓ రంజిత్‌ను విధులనుంచి తొలగించాలని, పూర్తి స్థాయిలో విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. ఇన్చార్జి ప్రిన్సిపల్ స్వలాభం కోసం అక్కడ ఉన్న అడిషనల్ డీఈవో ప్రవీణ్ ని కాపాడడం కోసం అక్కడే పనిచేస్తున్న కంప్యూటర్ టీచర్ పాఠశాలకి నాలుగు కిలోమీటర్ల దూరంలో తన నివాసం ఉన్నప్పటికీ) అపూర్వ మేడంని ఒక మహిళ అని కూడా చూడకుండా 90 కిలోమీటర్ల దూరంలో ఉన్న తాడ్కోల్ గురుకుల పాఠశాలకి పంపించడం అక్రమమైందన్నారు. వెనుక ఉండి నడిపించిన డిప్యుటేషన్‌లో జోనల్ ఆఫీస్‌లో పనిచేస్తున్న ఔట్సోర్సింగ్ డిఈఓ రంజిత్‌ని తక్షణమే విదుదల నుంచి తొలగించాలని డిమాండ్ కార్యక్రమంలో నాయకులు భాను ప్రియ, వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరాంపూర్ వీడీసీని రద్దు చేయాలి

- తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం

నవతెలంగాణ-ఆర్మూర్

ఏర్గట్ల మండల కేంద్రం తాళ్ల రాంపూర్ గ్రామంలో దాదాపు 16 మంది గీత కార్మికులను బహిష్కరించడం అమానుషమని, వీడీసీల నియంతృత్వ పరిపాలన అరికట్టే విధంగా చర్య తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు అబ్బ గొని అశోక్ గౌడ్ డిమాండ్ చేశారు. సోమవారం తాళ్లరాంపూర్ గ్రామంలో పలువురు బీసీ నాయకులతో కలిసి మాట్లాడుతూ .. గీత కార్మికులలో ఎస్సీ, ఎస్టీ, బీసీలు అందరూ కలిసి పనిచేస్తుండగా వారిని అవమానపరచడమే కాకుండా గ్రామం నుండి బహిష్కరణ చేసినందున వీడీసీలపై తగిన చర్య తీసుకోవాలని కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. శ్రీరామనవమి పర్వదినాన గౌడ సోదరులు కుంకుమార్చనలో భాగంగా ఆలయంలో కుంకుమార్చన చేయ టానికి అన్ని సిద్ధం చేసుకుని వచ్చారని, వారిని అదే సమయంలో బయటకు గెంటి వేయడం పట్ల తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. వారినీ కస్టడీలోకి తీసుకోవాలని ఆర్మూర్ ఏసీపి కి ఫిర్యాదు చేశారు. గీత కార్మికులకు, గౌడ కులస్తులకు తగిన బందో బస్తు ఏర్పాటు చేయాలని, వారికి ప్రాణహాని ఉందని, గ్రామంలో 144వ సెక్షన్ విధించాలని, పికెటింగ్ ఏర్పాటు చేయాలని ఏసీపిని కోరారు. వెంటనే తాళ్ల రాంపూర్‌లో వీడీసీ వ్యవస్థను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తెలంగాణ బీసీ గ్రాడ్యుయేట్స్ ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షులు సూరీనీడ దశరథ్, సాయన్న, నర్సాగౌడ్, తదితరులు పాల్గొన్నారు .

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కామారెడ్డి
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

ప్రజావాణికి ఫిర్యాదులు నిల్

నవతెలంగాణ-తాడ్వాయి

తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణికి ఎలాంటి ఫిర్యాదులు రాలేదని తహసీల్దార్ రహీముద్దీన్ తెలిపారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ, ఎంపీఓ సవితారెడ్డి, మండల వ్యవసాయ శాఖ అధికారి నరసింహులు, ఏపీఎం మనోహర్. విద్యాశాఖ అధికారి రామస్వామి, ఆర్డబ్ల్యూఎస్, ఈజీఎస్, ఐసిడిఎస్, తదితర శాఖల అధికారులు హాజరయ్యారని తెలిపారు.


ప్రజావాణికి హాజరైన అధికారులు

ప్రజావాణిలో మండల అధికారులు

నవతెలంగాణ-రాజంపేట్

మండల అధికారులు కలెక్టర్ నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో సోమవారం పాల్గొన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల తహసీల్దార్ సురేష్ రెడ్డి, ఎంపీఓ రఘురాం మండల స్థాయి అధికారులు పాల్గొనడం జరిగింది. ప్రజావాణిలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కారిస్తామని తెలిపారు.


ప్రజావాణిలో పాల్గొన్న అధికారులు

చికెన్‌పాక్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- **మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రోహిత్**

నవతెలంగాణ-నిజాంసాగర్

ప్రస్తుతం వాతావరణంలో వివిధ మార్పులు చోటుచేసుకుంటున్న వేళ వివిధ ప్రాంతాల్లో చికెన్‌పాక్స్ కేసులు పెరుగుతున్నాయి. ముఖ్యంగా మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ వ్యాధి విస్తరిస్తోంది. ప్రజలు అప్రమత్తంగా ఉండి రక్షణ చర్యలు చేపట్టాలని నిజాంసాగర్ మండల వైద్య అధికారి రోహిత్ సూచిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన నవతెలంగాణతో ప్రత్యేకంగా చికెన్‌పాక్స్ లక్షణాలు ప్రివెన్షన్ చర్యల గురించి తెలిపారు.

చికెన్‌పాక్స్ లక్షణాలు..

తీవ్రమైన జ్వరం, దద్దుర్లు, నీళ్లతో నిండిన బుగ్గలు, తలనొప్పి, అలసట, మంట, చర్మంపై తీవ్రంగా గోకడం, ఆకలి కోల్పోవడం వంటివి అనిపిస్తే వెంటనే వైద్య సహాయం పొందాలి.





ప్రివెన్షన్ చర్యలు..

చికెన్‌పాక్స్ సోకిన రోగులను పూర్తిగా విశ్రాంతి తీసుకునేలా చూడాలి. ఇతరులకు వ్యాపించకుండా రోగిని దూరంగా ఉంచాలి. రోగి శుభ్రత పాటించి, చేతులు తరచూ కడుక్కోవాలి. ఊరికే గోకకుండ ఉండటానికి కూలింగ్ లోషన్లు, చికిత్సా మందులు వాడాలి.

ఆరోగ్య శాఖ సూచనలు..

రోగ నిరోధక శక్తిని పెంచుకోవడానికి పోషకాహారం తీసుకోవాలి. స్వీయ వైద్యం చేసుకోవడం కంటే వైద్యులను సంప్రదించడం మంచిది. ప్రభుత్వ వైద్య శిబిరాలు ఉచితంగా చికిత్స అందిస్తున్నాయి.

అవిశ్వాస నమ్మకాలపై హెచ్చరిక..

చికెన్‌పాక్స్‌ను కొందరు దైవశిక్షగా భావించి వైద్యసహాయం తీసుకోకుండా ఉంటున్నారు. కానీ ఇది వైద్యపరమైన వ్యాధి, దీనికి సముచితమైన చికిత్స అవసరం. ప్రజలు మూఢనమ్మకాలను నమ్మకుండా వైద్యుల సూచనలను పాటించి సరైన ఔషధాలు, శుభ్రత, విశ్రాంతితో త్వరగా కోలుకోవచ్చు. ప్రజలందరూ జాగ్రత్తలు పాటించి, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశాడు.

సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-ఎడపల్లి

మండల కేంద్రంలోని సహకార సంఘంలో సీఎం సహాయనిధి చెక్కులు లబ్దిదారులకు సోమావారం పంపిణీ చేశారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి సహాయ సహకారంతో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పులి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో చెక్కుల పంపిణీ చేశారు.

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-పోతంగల్

మండలంలోని కొల్లూరు, సుంకి, పోతంగల్ ఇతర గ్రామాలలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ సోమవారం నిర్వహించారు. మాజీ జెడ్‌పిటిసి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు శంకర్ మాట్లాడుతూ.. దేశంలో నియంతత్వ, అప్రజాస్వామిక పాలన కొనసాగిస్తున్న ప్రభుత్వ విధానాలను ప్రజలకు తెలుపాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ప్రజలు, కార్యకర్తలు రాజ్యాంగ ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు గంధపు దత్తు, రాజు, ఎఎంసి చైర్‌పర్సన్ హనుమంతు, ఏఎంసి డైరెక్టర్ సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

రామాలయ బ్రహ్మోత్సవాలకు రావాలని మాజీ ఎమ్మెల్యేకు ఆహ్వానం


ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ సిబ్బంది

నవతెలంగాణ-రామారెడ్డి

మండల కేంద్రంలో శ్రీ సీతారామచంద్రస్వామి, శ్రీ రాజరాజేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్‌ను ఆహ్వానిస్తూ ఆహ్వాన పత్రికను అందజేశారు. సోమవారం బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి, ఆలయ అభివద్ధి కమిటీ మాజీ అధ్యక్షులు పడిగల శ్రీనివాస్, ఉత్సవ కమిటీ ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, సెక్రటరీ కుశనుల రమేష్, సభ్యులు కడియం శ్రీకాంత్, బీఆర్ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-రాజంపేట్



మండల కేంద్రంలో గ్రామపం చాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించినట్టు పంచాయతీ కార్యదర్శి అశోక్ సోమవారం తెలిపారు. వేసవిలో కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బంలు కలుగకుండా తాగునీరు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. గ్రామ పోలీసు అధికారి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయపరమైన సేవలందించడమే ముఖ్య ఉద్దేశం

నవతెలంగాణ-విలేకరుల బృందం

జుక్కల్: న్యాయపరమైన సేవలందించడమే.. న్యాయసేవ అధికారిక సంస్థ ముఖ్య ఉద్దేశమని ఎంఆర్ఐ రామారావు, ఏఎస్ఐ వెంకట్రావ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో హైకోర్టు, రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కోర్టు ఉత్తర్వులు ఆదేశాల మేరకు ఏర్పాటు చేసిన కమ్యూనిటీ మీడియేషన్ కార్యాలయాన్ని బిచ్కుంద కోర్టు సివిల్ జడ్జి ప్రారంభించారు. ఇట్టి మీడియేషన్ సెంటర్ న్యాయపరమైన సేవలందించడం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై, ఎంఆర్ఐ, మండల కోఆర్డినేటర్, పోలీస్ సిబ్బంది, జీపి జూనియర్ అసిస్టెంట్ గల్కుట్ రాజు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను సద్వినియోగించుకోవాలి..

గాంధారి : కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను మండల ప్రజలు సద్వినియోగించుకోవాలని తహసీల్దార్ రేణుక చవాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను స్థానిక అధికారులతో కలిసి తహసీల్దార్ రేణుక చవాన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సామూహిక మధ్యవర్తిత్వ సేవలు ఉచితమని, సామూహిక మధ్యవర్తిత్వ కార్యకలాపాలు పూర్తిగా రహస్యంగా ఉంచబడతాయన్నారు. సామూహిక మధ్యవర్తిత్వ కేంద్రంలో విచారించిన విషయాలు ఇతరులతో పంచుకొనబడవని తెలిపారు. చర్చలు, సమ్మతి పద్ధతులతోనే వివాదాల పరిష్కారం చేయబడతాయన్నారు. మధ్యవర్తుల సమక్షంలో ఎలాంటి ఒత్తిడి లేకుండా స్వేచ్ఛాయుత ఒప్పదం జరుగుతాయని, సుదీర్ఘమైన న్యాయ ప్రక్రియల నుంచి విముక్తి జరుగుతుందని పేర్కొన్నారు. మధ్యవర్తుల సేవలు సమాజ హితం కొరకు మాత్రమే ఉపయోగిస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎస్సై ఆంజనేయులు, ఏపీఓ లక్ష్మీనారాయణ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు, కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్ నిర్వాహకులు, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేట్ : మండల కేంద్రంలోని గ్రామ సచివాలయంలో కమ్యూనిటీ మీడియేషన్ సెంటర్‌ను ఎస్సై వెంకట్రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నల్స న్యూఢిల్లీ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర లీగల్ సర్వీస్ అథారిటీ హైదరాబాద్ వారి ఆదేశానుసారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సూచనల మేరకు మండల కేంద్రంలో కమ్యూనిటీ మీడియేషన్ ప్రారంభించామన్నారు. ఈ సెంటర్‌లో ప్రజల్లో ఏర్పడినటువంటి తగాదాలతో పాటు వివిధ రకాల సమస్యలను ప్రజలు నేరుగా వచ్చి సెంటర్లోని సభ్యులకు వివరించాలన్నారు. సకాలంలో సభ్యుల సమస్యను పరిష్కరించే విధంగా నచ్చచెప్తామన్నారు. ఒకవేళ సమస్య ఇరువురు అంగీకరించకుంటే బాధితులు కేసును స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. అన్ని వర్గాల ప్రజలకు ఇది ఉపయోగపడుతుంద పేర్కొన్నారు. ప్రతి చిన్న విషయానికి పోలీస్ స్టేషన్‌కు రావడం ప్రజలు విసుకు చెందకుండా సెంటర్లోనే ఇరువురుని సమక్షంలో సమస్య పరిష్కారం అవుతుందని తెలిపారు. గ్రామపంచాయతీ పరిధిలో ఈ కమిటీ పని చేస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపిఓ మలహరి, కార్యదర్శి శ్రావణ్ కుమార్, కమిటీ సభ్యులు అశోక్, శ్రీకాంత్ మాకం రాములు, రాజారాం బాలరాజ్, మునీర్ గ్రామపంచాయతీ, సిబ్బంది పాల్గొన్నారు.

సదాశివనగర్ : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో సామూహిక మధ్యవర్తిత్వ కేంద్రాన్ని సీఐ సంతోష్‌కుమార్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. మధ్యవర్తిత్వ కార్యకలాపాలు రహస్యంగా, నిష్పక్షపాతంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. సమస్యలను చర్చించి పరిష్కరించడం జరుగుతుందన్నారు. మధ్యవర్తుల సమక్షంలో ఒత్తిడి లేకుండా స్వేచ్ఛాయుతంగా ఒప్పందాలు జరుగుతుందన్నారు. మధ్యవర్తుల సేవలు సమాజ హితం కోసమే వినియోగించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో సీఐ సంతోష్ కుమార్, ఎంపీఓ సురేందర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి ప్రశాంత్, డిఎల్ఎస్ అధికారి ఉదయ, పీఎల్వీ స్వప్న, కౌన్సిలింగ్ మెడియేషన్ వాలెంటర్స్ బిఎం విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.


జుక్కల్‌లో...


సదాశివనగర్‌లో...

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ నాయకులు

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని వాడి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు కాంగ్రెస్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు గులాం హుసేన్ సోమవారం తెలిపారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్మోహన్ రావు చేస్తున్న అభివద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్టు ఆయన తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

నాసీరకం వస్తువులు అమ్మితే కఠిన చర్యలు

- **ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్ సునీత**

నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

నాసీరకం వస్తువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సెక్యూరిటీ ఆఫీసర్ సునీత అన్నారు. సోమవారం మండల కేంద్రంలో గల కిరాణా దుకాణాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కొనుగోలు దారులకు కిరాణా దుకాణం దారులు నాసిరకమైన వస్తువులను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన రాజా రాజేశ్వరి కిరాణంలో పల్లీలు నాసిరకంగా ఉన్నాయని, అదేవిధంగా సాంబార్ మసాలా ఎక్స్‌పైర్ కావడంతో రెండు వస్తువులను తనతోపాటు శాంపిల్ కొరకు తీసుకెళ్లారు. నాణ్యమైన వస్తువులను విక్రయించాలని, నాసిరకం వస్తువులు విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని పేర్కొన్నారు.

స్నానానికి వెళ్లి వ్యక్తి మృతి

నవతెలంగాణ-నిజాంసాగర్

స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు మంజీరనదిలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన బంజపల్లి గ్రామ శివారులో సోమవారం చోటుచేసుకుంది. ఎస్సై శివకుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గడ్డం బాగయ్య(48) బంజేపల్లి గ్రామ శివారులో గల మంజీరనది చిన్నపూల్ బ్రిడ్జి వద్ద స్నానానికి వెళ్లాడు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు మంజీరా నదిలో పడి మృతిచెందాడు. మృతుడి అన్న కొడుకు సాయిలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబేద్కర్ జయంతి ఉత్సవ వేడుకలు

నవతెలంగాణ-సదాశివనగర్

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని డాక్టర్ అంబేద్కర్ జయంతి ఉత్సవ వేడుకలను ఏప్రిల్ 5వ నుంచి 13 వరకు నిర్వహించి 14న అంబేద్కర్ జయంతిని అంబేద్కర్ యువజన సంఘం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామం వారు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా సంఘం ప్రెసిడెంట్ రాజు మాట్లాడుతూ.. ఛత్రపతి శివాజీ మహారాజు జయంతి ఉత్సవాలను, మహాత్మ జ్యోతిరావు పూలే ఉత్సవాలను నిర్వహించేవారు. జ్యోతిరావు పూలే ఆలోచనకు కొనసాగింపుగా అంబేద్కర్ జయంతి ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలి

- **ఐవిఎఫ్, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు బాలు**

నవతెలంగాణ-తాడ్వాయి

ఈనెల 14న మండల కేంద్రంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్టు ఐవిఎఫ్, సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షులు బాలు తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పలువురు రక్త దాతలను కలిసి శిబిరం ఏర్పాట్లపై చర్చించి, కరపత్రాలను విడుదల చేశారు. కార్యక్రమంలో బండారు సంజీవ్, గైని శివాజీ, మేకల రాజు, వెంకటరమణ, డి.సంతోష్, గఫూర్, అనిల్, తదితరులు పాల్గొన్నారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే


బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని బోనాల్ తాండకి చెందిన మండల బంజారా సంఘం అధ్యక్షుడు గన్ను నాయక్ అమ్మ మాజీ ఎంపీటీసీ కేతావత్ పెమ్లి బాయి సోమవారం ఉదయం మరణించారు. మరణించిన సమాచారం అందిన వెంటనే ఎల్లారెడ్డి మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్ స్వగృహానికి వెళ్లి పార్థివ దేహానికి పూమాల వేసి నివాళులర్పించారు. అనంతరం శోక సంద్రంలో ఉన్న కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాడ సంతాపాన్ని వ్యక్తం చేశారు. అనంతరం అంత్యక్రియల్లో పాల్గొన్నారు. ఈయన వెంట మార్కెట్ కమిటీ డైరెక్టర్ దేశ నాయక్, ముధం సాయిలు, సాయ గౌడ్. నరహులు రూప్ సింగ్, సంగయ్య పటేల్, తదితరులు ఉన్నారు.

హైదరాబాద్ నుంచి తీసుకొచ్చి..
మేడిపల్లి అటవీ ప్రాంతంలో హత్య

- **కొడుకును ఎత్తుకెళ్లిందన్న అనుమానంతో..**

నవతెలంగాణ-గాంధారి


వివరాలు తెలుసుకుంటున్న ఎస్సై

మండలంలోని మేడిపల్లి, చందానగర్ తాండాకు చెందిన కేతావత్ పిరాజీ గత కొంత కాలంగా హైదరాబాద్‌లోని బేగంపేట్‌లో బిక్షాటన చేస్తూ నివసిస్తున్నాడు. అమీనా బేగం అక్కడే బిక్షాటన చేస్తూ జీవిస్తోంది. ఫిరాజీ కొడుకు శ్రీకాంత్(4) అమీణా బేగం ఎత్తుకుపోయిందనే అనుమానంతో హైదరాబాద్ నుంచి ఆమెను తీసుకువచ్చి గాంధారి మండలంలోని మేడిపల్లి గ్రామ శివారులో గల అటవీ ప్రాంతంలో నా కొడుకు ఎక్కడ ఉన్నాడో చెప్పు అంటు విపరీతంగా కట్టెలతో కొట్టడంతో కుడిచేయి విరిగిపోయింది. తీవ్ర రక్తస్రావం కాగా 108లో గాంధారి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందింది. మేడిపల్లి మాజీ సర్పంచ్ నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. సదాశివనగర్ సిఐ సంతోష్ కుమార్ విచారణ చేస్తున్నట్టు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు.

నీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు చేపట్టాలి

- **ఎంపీడీవో కమలాకర్**

నవతెలంగాణ-పిట్లం



నీటి ఎద్దడి రాకుండా ఎప్పటికప్పుడు నివారణ చర్యలు చేపట్టాలని మండల పరిషత్ అభివద్ధి అధికారి కమలాకర్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని దళితవాడ, కుంట కట్ట కాలనీలను పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవి కాల దృష్ట్యా మండలంలోని ఆయా గ్రామపంచాయతీలలో తాగు నీటి సమస్యలు తలెత్తకుండా నిరంతర ప్రక్రియలో భాగంగా వాటర్ ట్యాంక్‌ల సామర్థ్యము, ఇంటింటా కుళాయిలను పరిశీలించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుధాకర్, పంచాయతీ సెక్రెటరీలను, మిషన్ భగీరథ సిబ్బందిని ఆదేశించారు. ఎక్కడైనా నీటి సమస్యలు ఉత్పన్నమైతే అక్కడి కాలనీ ప్రజలకు నీటిని పొదుపుగా వాడుకునేల చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ బలరాం, సిబ్బంది పాల్గొన్నారు.

పన్ను చెల్లించి.. అభివృద్ధికి సహకరించండి

- **ఎంపీఓ సవిత రెడ్డి**

నవతెలంగాణ-తాడ్వాయి

మండలంలోని గ్రామాల ప్రజలు ఇంటిపన్ను చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని మండల పంచాయతీ అధికారిని సవిత రెడ్డి అన్నారు. సోమవారం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటిపన్ను చెల్లించాలని తెలిపారు. గత రెండు సంవత్సరాల నుంచి ఇంటిపన్ను అధికంగా పెరిగిపోయిందన్నారు. గ్రామాల్లో టాక్స్, చెల్లించి కార్యదర్శులకు సహకరించాలని కోరారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-సదాశివనగర్

మండల కేంద్రంలో బీజేపీ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. భారత్‌మాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆవిర్భావ దినోత్సవం పురష్కరించుకుని బిజెపి జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల బీజేపీ అధ్యక్షులు కుంట రామిరెడ్డి, మండల ఇంచార్జి జిల్లా జనరల్ సెక్రెటరీ గరుడ రవీంద్రరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గంగారెడ్డి, జిల్లా ఎగ్జిక్యూటివ్ నెంబర్ గంగాధర్ రావు, కార్యకర్తలు, పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలను సద్వినియోగించుకోవాలి

- **చైర్మన్ సాయికుమార్**


వరి కొనుగోలు కేంద్రాలను ప్రారంభిస్తున్న చైర్మన్

నవతెలంగాణ-గాంధారి

వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని చైర్మన్ సాయికుమార్ అన్నారు. సోమవారం ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ పరధిలో గుర్జాల్, మాతుసంగెం, పెట్‌సంగెం గ్రామలలో వరి కొనుగులు కేంద్రాలు సొసైటీ చైర్మన్, ఉమ్మడి జిల్లా డీసీసిబి, ఐడిసిఎంఎస్ డైరెక్టర్ పెద్దబూరి సాయికుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చెర్మెన్ ఆకుల లక్ష్మన్, నాయకులు తూర్పు రాజులు, లైన్ రమేష్, మదర్, సంగని బాబా, బొమ్మని బాలయ్య, రైతులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

మొక్కలకు నీటిని అందించాలి

- **ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ**

నవతెలంగాణ-తాడ్వాయి

నర్సరీలో మొక్కలకు ఎప్పటికప్పుడు నీటిని అందించాలని ఎంపీడీవో సయ్యద్ సాజిద్ అలీ అన్నారు. సోమవారం మండలంలోని కష్టాజివాడి నర్సరీని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మొక్కలు వాలిపోకుండా చూడాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. నర్సరీలో పిచ్చి మొక్కలు పెరిగితే తొలగించాలని తెలిపారు. నీటి తెరలు పూర్తిగా సరిచేసి అమర్చాలని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బడిబాట

నవతెలంగాణ-ముప్కాల్



ముప్కాల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం సోమవారం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమంను చేపట్టారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు యం.గంగారాం మాట్లాడుతూ.. పాఠశాల అధ్యాపక బృందం తీసుకున్న సమిష్టి నిర్ణయం పట్ల 2025-26 ఈ విద్యాసంవత్సరంలో విద్యార్థుల సంఖ్య పెంచాలని ముందస్తుగానే బడిబాట కార్యక్రమం నిర్వహించామన్నారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల తీసుకున్న నిర్ణయాన్ని గ్రామస్తులు, పలువురు ప్రముఖులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో ముప్కాల్ పాఠశాల అధ్యాపక బృందం గుండోజి నరేందర్, కొండ్రు నవీన్, పావని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్రపవర్ ఎంప్లాయిస్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-ఆర్మూర్

తెలంగాణ రాష్ట పవర్ ఎంప్లాయిస్ యూనియన్ (భారతీయ మజ్దూర్ సంఘ్ అనుబంధం) జిల్లా నూతన కార్యవర్గాన్ని రాష్ట ప్రధాన కార్యదర్శి ఎం.శశి కుమార్ ప్రకటించినట్టు జిల్లా ప్రధాన కార్యదర్శి టి మహేందర్ గౌడ్ సోమవారం తెలిపారు. అధ్యక్షులుగా :బాధవత్ సంతోష్ నాయక్, వర్కింగ్ ప్రసిడెంట్ గా ఎండీ.మోహినోదిన్, వైస్ ప్రెసిడెంట్గా కే.సంతోష్ ,ఏ.మధుసూదన్ గౌడ్, ఎం. సుభాష్ రావు, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా పి.రామకృష్ణ, ఎం.రతన్ సింగ్ రాజు, అసిస్టెంట్ సెక్రటరీలుగా పి.సాగర్. .సురేందర్, ఎస్.నరేష్, పి.రాజేష్, పబ్లిసీటీ సెక్రటరీగా: జె. రాంప్రసాద్, జాయింట్ సెక్రెటరీగా భిక్షపతి వి.ప్రేమ్ కుమార్ఎ స్.నవీన్ కుమార్ సిహెచ్.సత్యనారాయణ, కోశాధికారిగా పంగ రవిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీసీఎల్ కంపెనీ అధ్యక్షులు ఆర్ రమణ రెడ్డి, కామారెడ్డి జిల్లా అధ్యక్షులు అధ్యక్ష కార్యదర్శులు కే అశోక్, కే చంద్రశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్గా బాలరాజు, ఎమ్మెస్ మూర్తి, పిట్టల రాజు, గొలుసు ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు

నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు

నవతెలంగాణ-బాల్కొండ

బాల్కొండ మండల కేంద్రంలోని అతి పురాతన చరిత్ర గల సయ్యద్ షా బందగీ బాద్షా ఖాద్రి దర్గాలో నేటి నుంచి ఉర్సు ఉత్సవాలు జరగనున్నాయి. సనాతన ఆచారం ప్రకారం ఇస్లామిక్ క్యాలెండర్ మేరకు శవ్వాలు మాసంలో 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు ఉత్సవాలు జరుగుతాయని దర్గా ముతవల్లి సయ్యద్ షా బంధగి భాద్షా రియాజ్ ఖాద్రి తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

బిజెపి ఎమ్మెల్సీలకు సన్మానం



ఎమ్మెల్సీని సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు, జిల్లా అధ్యక్షులు

నవతెలంగాణ నిజామాబాద్ సిటీ

ఉమ్మడి కరీంనగర్, నిజామాబాదు, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల శాసనమండలి సభ్యులుగా నేడు ప్రమాణస్వీకారం చేసిన టీచర్ ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య, పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డిని బీజెపి రాష్ట్ర కార్యాలయంలో ఇందూర్ అర్బన్ శాసనసభ్యులు ధన్ పాల్ సూర్యనారాయణ, జిల్లా అధ్యక్షులు దినేష్ పటేల్ శాలువాతో సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీలు, హామీలు మరిచి మోసపూరితంగా వ్యవహరిస్తున్న కాంగ్రెస్‌కు మేధావులు, పట్టభద్రులు, టీచర్స్ అందరు ఏకం అయ్యి తగిన గుణపాఠం చెప్పారని అన్నారు. ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి ఎమ్మెల్సీలను అభినందించారు.

శ్రీరాముని పట్టాభిషేకం

- పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్

నవతెలంగాణ-డిచ్‌పల్లి

మండలంలోని ఖిల్లా రామాలయంలో ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాముని పట్టాభిషేకంతో పాటు అభిషేకంలో మాజీ ఆర్టీసీ చైర్మన్, నిజామాబాద్ రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవ మూర్తులను తీసుకుని ఆలయం చుట్టూ తిరిగి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అర్చకులు సుమిత్ శర్మ సుమిత్పాండే ఆధ్వర్యంలో శ్రీరామునితో పాటు సీతాలక్ష్మణుడికి ప్రత్యేకంగా అభిషేకాలు నిర్వహించి పట్టాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడారు. ప్రజలు ఎల్లప్పుడూ సుభిక్షంగా ఉండాలని శ్రీరాముని పరిపాలన అలా ఉండేదన్నారు. బాజిరెడ్డి గోవర్ధన్ ను ఆలయ కమిటీ సభ్యులు శాలువ, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ధర్పల్లి మాజీ జడ్పీటీసీ బాజిరెడ్డి జగన్మోహన్, మాజీ ఐడీసీయంయస్ చైర్మన్ సంబారి మోహన్, ఆలయ చైర్మన్ కాంతయ్య, బిఆర్ఎస్ మాజీ మండల అధ్యక్షులు శక్కరికొండ కృష్ణ, ఒడ్డెం నర్సయ్య,నీరడి పద్మరావు, ఉప సర్పంచ్ ల సంఘం మండల కన్వీనర్ రఘునందన్ రాము, ప్రతాప్ రెడ్డి, లక్ష్మీనర్సయ్య, పాషా, గిరి, సాయరెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు వీడీసీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీ రాముని కల్యాణం

నవతెలంగాణ-ముప్కాల్

శ్రీ కోదండ రామాలయం 51 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా చేపట్టడం జరుగుతుందని ఆలయ అర్చకులు జోషి నాగరాజు తెలిపారు. శ్రీ కోదండ రామాలయం' యాభై ఒక వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఇట్టి మహోత్సవాలను భక్తుల మధ్య పెద్ద ఎత్తున వైభవంగా నిర్వహిస్తూ ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. భక్తుల మధ్య శ్రీరాముని కళ్యాణ మహోత్సవంతో పాటు రథోత్సవం అంగరంగ వైభవంగా చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం మహా అన్నదాన సత్రం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు..


ముగిసిన బార్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ ప్రక్రియ

నవతెలంగాణ-ఆర్మూర్

పట్టణ బార్ అసోసియేషన్ ఎలక్షన్స్ సందర్భంగా నామినేషన్ ల ప్రక్రియ సోమవారంతో ముగిసింది. బార్ అసోసియేషన్ అధ్యక్షుని పోటీకి జక్కుల శ్రీధర్, టీకె కోనేరు, పిఎస్ విజయ లక్ష్మి నామినేషన్ వేశారు. ఉపాధ్యక్షుని పదవికి కుదురు పాక ప్రవీణ్ చందర్, గటడి ఆనంద్ నామినేషన్ వేశారు. జనరల్ సెక్రటరీ పదవికి గుంజల సుదర్శన్, జెస్సు అనిల్, పి.హరి వర్ధన్ నామినేషన్ వేశారు. ట్రెజరర్, జాయింట్ సెక్రటరీ, లైబ్రరీ సెక్రటరీలకు ఒక్కొక్కరే నామినేషన్ వేశారని ఎలక్షన్ అధికారులు సేరియల జగన్, కొత్త పల్లి రాములు తెలిపారు.

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు

- చౌట్‌పల్లి సింగిల్‌విండో చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి



ధాన్యం కొనుగోలు ప్రారంభిస్తున్న సొసైటీ చైర్మన్

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని సొసైటీ చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి అన్నారు. సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సోమవారం మండలంలోని చౌట్ పల్లి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సొసైటీ చైర్మన్ కుంట ప్రతాప్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, బి గ్రేడ్ ధాన్యానికి రూ. 2300 మద్దతు ధరను ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ప్రతి రైతు వరికి 17 శాతం మ్యాచరు వచ్చేటట్టు రైతులు ధాన్యాన్ని ఆరబెట్టాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు, సింగిల్ విండో కార్యదర్శి శంకర్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

10 నుంచి 14వరకు

163(బిఎన్ఎస్) సెక్షన్ అమలు



నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఈనెల 10నుండి 14 వరకు163(బిఎన్ఎస్) సెక్షన్ అమలులో ఉంటుందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయిచైతన్య సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రానున్న హనుమాన్ జయంతి మతపరమైన పండుగను దృష్టిలో ఉంచుకుని, చట్టవిరుద్ధమైన ఘటనలు జరగకుండా నిరోధించడానికి, చట్టవిరుద్ధమైన సమావేశాలను నిరోధించే ఉత్తర్వులకు నిషేధాజ్ఞలు ప్రకటించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ప్రశాంతతను కాపాడే దృష్ట్యా, పరిస్థితిని జాగ్రత్తగా సమీక్షించిన తర్వాత, నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయిచైతన్య-ఐపిఎస్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ తన అధికారాలను వినియోగించుకుంటూ యుఎస్ 163 బిఎన్ఎస్ఎస్ చట్టబద్ధమైన సమావేశాన్ని సంబంధిత అధికారుల నుండి ముందస్తు అనుమతి పొందిన తర్వాత మాత్రమే నిర్వహించాలని తెలిపారు. ప్రసంగం, చిహ్నాలు, ప్లకార్డులు లేదా వివిధ వర్గాలు లేదా వ్యక్తుల మధ్య మతపరమైన శత్రుత్వం, ద్వేషాన్ని సృష్టించే లేదా చట్టబద్ధమైన అధికారాన్ని ధిక్కరించే లేదా భంగం కలిగించే ఏదైనా నేరానికి దారితీసే ఏదైనా ఇతర వస్తువులను నిషేధించాలని పేర్కొన్నారు. ఏదైనా మండే పదార్థం లేదా ఏదైనా ఇతర పదార్థాన్ని తీసుకెళ్లడాన్ని నిషేధించాలని, బహిరంగ ప్రదేశాల్లో మద్యం, కల్లు లేదా ఏదైనా ఇతర రకాల మద్యం, మత్తు పదార్థాలను సేవించడాన్ని నిషేధించాలని తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో నిషేధిత వస్తువులను తీసుకెళ్లడాన్ని నిషేధించాలని, కమిషనరేట్ పరిధిలోని అన్ని బహిరంగ ప్రదేశాల్లో క్రాకర్లను పేల్చడాన్ని నిషేధించాలని పేర్కొన్నారు. ఊరేగింపులు సహా ప్రజా సమావేశాల స్థానంలో డీజేలు (హై వాల్యూమ్ సౌండ్ మిక్సర్లు) సహా అధిక వాల్యూమ్ ధ్వని ఉద్గార వ్యవస్థలను నిషేధించాలని, శబ్దాన్ని ఉత్పత్తి చేయడానికి ఘర్షణ సైలెన్సర్‌తో బైక్ ర్యాలీ బైక్ రైడ్‌ను నిషేధించాలని తెలిపారు. అవమానకరమైన రీతిలో ఫ్లెక్సీలు, బ్యానర్‌లను ఇతర వర్గాల ప్రదర్శనకు ఉపయోగించడాన్ని నిషేధించాలని పేర్కొన్నారు. సాధారణ ప్రజల భద్రతా సమస్యల కారణంగా జనసాంద్రత ఉన్న ప్రాంతాల్లో డ్రోన్ వాడకాన్ని నిషేధించాలని తెలిపారు. ఈ ఆదేశాలను ఉల్లంఘించిన ఏ వ్యక్తి అయినా చట్టం ప్రకారం ప్రాసిక్యూషన్‌కు గురవుతారని పేర్కొన్నారు. ఈ ఉత్తర్వులు 10.04.2025 నుండి 14.04.2024 వరకు అమలులో ఉంటాయని, నిజామాబాద్ జిల్లాలోని అన్ని స్టేషన్ హౌస్ అధికారులు, సంబంధిత అధికార పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాలని, తదనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ ఉత్తర్వును ఉల్లంఘించే ఏదైనా సంస్థ లేదా వ్యక్తి సెక్షన్ 223 బి.ఎన్.ఎస్ ఇతర చట్టాలు వర్తించే చట్టపరమైన నిబంధనల ప్రకారం శిక్షకు గురవుతారని తెలిపారు.

కృష్ణవేణి పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే



నవతెలంగాణ- ఆర్మూర్

పట్టణంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థిని విద్యార్థులకు ఘనంగా గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. ఇందులో భాగంగా చిన్నారులు వారి ఆటపాటలతో అందరిని అలరించారు. ప్రిన్సిపల్ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను అందజేసినారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మహమ్మద్ మిన్హాజ్ మాట్లాడుతూ ప్రైమరీ స్థాయి నుండి విద్యార్థులు కష్టపడి చదవాలని, అప్పుడే ఉన్నత స్థాయికి ఎదుగుతారని విద్యార్థులకు చిన్నతనం నుండి క్రమశిక్షణ అవసరమని అన్నారు. తల్లిదండ్రులు ముఖ్యంగా విద్యార్థులకు సెల్ ఫోన్ లను నుండి దూరంగా ఉంచాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విద్యా సంస్థల జోనల్ ఇన్చార్జ్ శేఖర్ రెడ్డి, పాఠశాల డైరెక్టర్లు విజయ్ కర్తాన్, మోహిన్ జబ్రి, నాగేశ్వరరావు, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో అనేక పథకాలు అమలుచేశాం

- బీఆర్ఎస్‌లో చేరికలు
- కండువా కప్పి ఆహ్వానించిన గణేష్ బిగాల, జీవన్ రెడ్డి

నవతెలంగాణ-కంఠేశ్వర్

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీలో భారీ చేరికలు జరిగాయి. నిజామాబాద్ కార్పొరేషన్ పరిధిలోని డివిజన్ 12, 30, 31 నుంచి భారీ మైనార్టీ యువత గులాబీ కండువా కప్పుకున్నారు. ఈ మేరకు సోమవారం టిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆశన్నగారి జీవన్ రెడ్డిలు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా మాట్లాడారు. మహ్మద్ ఇర్ఫాన్, అబ్దుల్ మాజీద్, జైను, నయీం, అలీం, షారూఖ్ నేతృత్వంలో భారీగా చేరినట్టు తెలిపారు. మా పాలనలో కేసీఆర్ కిట్, షాదీ ముబారక్, ఆసరగా ఫించన్లు, అనేక పథకాలను అమలు చేశామన్నారు. ఇలా పేదల కోసం ఆలోచించిన వ్యక్తి కేసీఆర్. ఇప్పుడున్న ఎమ్మెల్యే ఒక్క చెట్టు పెట్టలేదు. పెట్టిన చెట్టుకు నీళ్ల పోస్తలేరని తెలిపారు. నిజామాబాద్‌లో తమ హయాంలో మెరిసింది. కానిప్పుడు చీకట్లోలో గుడ్డిగా కనిపిస్తుందని, ఆ మెరుపుల ఇప్పుడు లేవని, రాత్రి పూట సిటీని చూస్తే ఒక్క లైట్ వెలుగుతలేదని అన్నారు. అందుకే ఇదంతా చూసి బీఆర్ఎస్ పార్టీలోకి వచ్చారన్నారు. వచ్చే కాలమంతా బీఆర్ఎస్ పార్టీదే. సీఎం అయ్యేది కేసీఆర్ మాత్రమేనని తెలిపారు.కాంగ్రెస్ పార్టీకి 10నెలల్లోనే వ్యతిరేకత వచ్చిందని, ఇప్పుడు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీకి 10 ఎమ్మెల్యే సీట్లు కూడా రావని సర్వే రిపోర్ట్‌లు చెబుతున్నాయన్నారు. మాకు మద్దతు తెలపండి.. మాకు అండగా నిలవండి. మీకు మేమున్నామంటూ గులాబీ పార్టీ శ్రేణులకు, మైనార్టీ నాయకులకు భరోసా కల్పించారు. కార్యక్రమంలో మాజీ మేయర్ దండు నీతూ కిరణ్ శేఖర్, మాజీ నుడా చైర్మెన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాష్, జగత్ రెడ్డి,నవీద్ ఇక్బాల్ మతీన్,ఇమ్రాన్ శేహజాద్ సనావుల్లా తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 27 న వరంగల్‌లో బీఆర్ఎస్ పార్టీ నిర్వహిస్తున్న రజతోత్సవ సభ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల నిజామాబాద్ అర్బన్ నుండి మూడువేల మందిని తరలించేందుకు డివిజన్ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు.



పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే

మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు కేసీఆర్

- రాష్ట్ర మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి
- వరంగల్ సభకు నియోజకవర్గం నుండి పెద్దఎత్తున తరలిరావాలి
- నియోజకవర్గ నాయకులు,కార్యకర్తల సన్నాహక సమావేశంలో ఎమ్మెల్యే



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మాట తప్పని మడమ తిప్పని నాయకుడు కేసీఆర్ అని రాష్ట్ర మాజీ మంత్రి ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. రానే రాదు అనుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని పేర్కొన్నారు. వరంగల్ సభకు బాల్కొండ నియోజకవర్గం నుండి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు. సోమవారం వేల్పూర్ మండల కేంద్రంలోని తన స్వగృహంలో బాల్కొండ నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో నియోజకవర్గస్థాయి సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా వేముల ప్రశాంత్ రెడ్డి మాట్లాడుతూ.. మాట తప్పని, మడమ తిప్పని నాయకుడు కేసీఆర్ అని, తెచ్చిన తెలంగాణను 10 ఏండ్లలో మానవీయ పరిపాలన అందించి దేశంలోనే అగ్రగామిగా కేసీఆర్ నిలిపారన్నారు. పార్టీ ఆవిర్భావం జరిగి 25 సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా వరంగల్ ఎల్కతుర్తిలో ఈ నెల ఏప్రిల్ 27న జరుగు బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భావ సభకు బాల్కొండ నియోజకవర్గం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరు కావాలని అన్నారు. 60 ఏండ్లుగా ఆంధ్ర పాలకుల కబంధ హస్తాల్లో నలిగిన తెలంగాణ విముక్తి కోసం ఆనాడు కేసీఆర్ ఒక్కడిగా బయలుదేరారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎన్నో ఒప్పందాలు బుట్ట దాఖలు అయ్యి తెలంగాణకు జరుగుతున్న అన్యాయాన్ని అరికట్టాలంటే ఒక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు అన్ని సమస్యలకు పరిష్కారం అని, రాష్ట్ర సాధనే లక్ష్యంగా తన అన్ని పదవులకు కేసీఆర్ రాజీనామా చేసినాడని గుర్తు చేశారు. 2001లో పార్టీ స్థాపించి 14 ఏండ్లుగా శాంతి యుతంగా ఉద్యమాన్ని ముందుండి కేసీఆర్ నడిపించారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని అనేక రంగాల్లో దేశంలోనే అగ్రగామిగా కేసీఆర్ ఉంచారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజాక్షేత్రంలో ఎండగడుతూ ప్రజల పక్షాన పోరాడుతున్నారన్నారు. నియోజకవర్గం ప్రతి గ్రామం నుండి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వరంగల్ సభకు తరలి రావాలని కోరారు. రంగల్ సభను విజయవంతం చేయడానికి గ్రామ గ్రామాన సన్నాహక సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలని నాయకులకు, కార్యకర్తలకు సూచించారు.

కొలతల్లో మార్పులతో కూలీలకు ఇబ్బందులు

- అఖిల భారత ఐక్య రైతు సంఘం

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

ఉపాధి హామీ పని కొలతల్లో మార్పులు తెచ్చి కూలీలను అనేక ఇబ్బందులకు గురిచేస్తున్నారని అఖిల భారత ఐక్య రైతు సంఘం నిజామాబాద్ జిల్లా అధ్యక్షులు ఎస్ సురేష్ అన్నారు. సోమవారం మండలంలోని హస కొత్తూర్ గ్రామంలో మాత్మ గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనుల వద్ద కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సారా సురేష్ మాట్లాడుతూ మండుటెండలో పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనాలను అందించడం లేదన్నారు. ప్రభుత్వం రూ. 397 కూలీని వేతనంగా ప్రకటించారే కానీ కొలతలలో మార్పులు తీసుకొచ్చి కూలీలను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతనాలు చట్టం అమలు చేయాలని, కూలీలందరికీ పని కల్పించాలని, బయోమెట్రిక్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూలీలందరికీ వారం డబ్బులు చెల్లించాలని, డబ్బులు చెల్లించకపోతే కూలీలు తీవ్రంగా నష్టపోతారన్నారు. గతంలో రావలసిన కూలి డబ్బులు ఇంతవరకు రాలేదని గుర్తు చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రావలసిన డబ్బులు అన్నింటిని కూలీలకు పంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అఖిల భారత ఐక్య రైతు సంఘం మండల నాయకులు ఉట్నూరి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నవతెలంగాణ-ఆర్మూర్

మున్సిపల్ పరిధిలోని పెర్కిట్, కోటార్మూర్‌లలో మంగళవారం ఉదయం 8 గంటల నుండి 12 వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ గడ్డం మౌనిక సోమవారం తెలిపారు. స్థానికంగా చెట్ల కొమ్మలను నరికి వేయడం జరుగుతుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

వీడీసి ఆగడాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

- తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్రజావాణిలో ఫిర్యాదు



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

నవతెలంగాణ-కంఠేశ్వర్

గౌడ, గీత కార్మికుల కుటుంబాలపై గ్రామాభివృద్ధి కమిటీల దౌర్జన్యం ఆగడాలపై కఠిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు మాట్లాడుతూ... గౌడ, గీత కార్మికులు తమ గీత వృత్తిపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నారని అన్నారు. ఎలాంటి చట్టబద్ధతలేని వీడీసీ లు వృత్తిదారులు, సామాన్య ప్రజల పైన కులబహిష్కరణలు, గ్రామ బహిష్కరణలు నిత్య కృత్యమవుతున్నాయన్నారు. ఇందులో భాగంగానే ఏర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామ గౌడ గీత కార్మికుల బతుకులు ఆందోళనకరంగా మారాయన్నారు. ఊర్లో కల్లు అమ్మాలన్నా, కూల్డ్రింకులు, ఇతర నిత్యవసర సరుకులు అమ్ముకోవాలన్నా, ఏ పని చేయాలన్నా వీడిసి లకు మాముళ్లు ఇవ్వాల్సిందేనని, లేకుంటే కుల బహిష్కరణ, గ్రామ బహిష్కరణలు చేసి జరుమానా విధిస్తూ రాక్షసానందం పొందుతున్నారన్నారు. ఆర్మూర్ డివిజన్లో సమాంతర ప్రభుత్వాలను నడుపుతున్నారని, ఈమధ్య ఎర్గట్ల మండలం తాళ్ల రాంపూర్ గ్రామ గౌడ కుటుంబాలను బహిష్కరించగా, శనివారం నాడు శ్రీరామ నవమికి గౌడ కుటుంబ మహిళలు గుడికి వెళ్తే వారిని రానివ్వక వీడిసి పెద్దలు, గుడి పూజారితో సహా అవమానించారంటే దేవుని పైన కూడా వీడిసి ఆగడాలు కొనసాగుతున్నాయన్నారు. గ్రామ అభివృద్ధి కమిటీల ఆగడాలపై చర్య తీసుకొని, భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా చూడాలని ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. చర్యలు తీసుకోకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర సలహాదారులు పెద్ది వెంకట్రాములు, జిల్లా కమిటీ సభ్యులు కోయడి నరసింహులు గౌడ్, సిదుకు శేఖర్ గౌడ్, శ్రీరామ్ గౌడ్, కిషన్ గౌడ్, శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

హక్కుల సాధనకు 19 నుంచి పంచాయతీ కార్మికుల సమ్మె



మాట్లాడుతున్న జంగం గంగాధర్

నవతెలంగాణ-కంఠేశ్వర్

గ్రామపంచాయతీ కార్మికులు, ఉద్యోగులు ఈ నెల 19 నుండి తమ హక్కుల సాధనకు సమ్మె బాటపట్టనున్నట్లు గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘం (సిఐటీయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగం గంగాధర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం నిజామాబాద్ - కామారెడ్డి (ఉమ్మడి జిల్లా) కమిటీ సమావేశం నిజామాబాద్ సిఐటీయూ జిల్లా కార్యాలయంలో నాయకులు రాజేష్, బాలనర్సు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా జంగం గంగాధర్ మాట్లాడుతూ.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామ పంచాయితీ అభివృద్ధికి నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. తెల్పినారు. కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నారని, అధిక పనిభారం, సెలవులు ఇవ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నారని వివరించారు. కనీసవేతనాలు 21వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రభుత్వ సెలవులు అన్నింటినీ కార్మికులకు వర్తింపచేయాలని, ఆరోగ్యభీమ సౌకర్యం కల్పించాలని, పెరుగుతున్న గ్రామ విస్తరణకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచాలని తదితర డిమాండ్‌లతో సమ్మెకు దిగనున్నట్లు వారు తెలిపారు. మహిళా సంఘం జిల్లా కార్యదర్శి సుజాత మాట్లాడుతూ... గ్రామాల్లో శ్రామిక మహిళలు అధికంగా ఉన్నారని, వారిపైన అనేక వేధింపులు పెరుగుతున్నాయని వీటిని అరికట్టేందుకు ఐద్వా కృషిచేస్తున్నట్లు తెలిపారు. గ్రామాలలో మహిళలపై ఏదైనా దుర్ఘటన జరిగితే పంచాయితీ కార్మికులు తగిన బుద్ధి చెప్పేవిధంగా ఉండాలని ఆమె పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు నాయక్వాడి శ్రీనివాస్, సాగర్, గణేశ్, పద్మక్క, సునీత, వందన, తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
మంగళవారం | ఏప్రిల్ 08, 2025 | www.navatelangana.com

9 గ్రామాలలో కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



నవతెలంగాణ-నాగిరెడ్డిపేట్

మండలంలోని తాండూర్, కిచ్చన్నపేట, మాల్ తుమ్మెద సొసైటీ పరిధిలో తొమ్మిది ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్టు చైర్మన్‌లు ఆకిడి గంగారెడ్డి, దుందిగల నరసింహులు సోమవారం తెలిపారు. తాండూర్ పరిధిలోగల ఆత్మకూర్, జలాల్పూర్, మెల్ల కుంట తండా, బొల్లారం, తాండూర్, రాఘవపల్లి, జాన్గంపల్లి అదేవిధంగా మాల్ తుమ్మెద సొసైటీ పరిధిలో గల శీనూర్ వాడి గ్రామాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి ఏఎంసీ చైర్మన్ రజిత వెంకటరామిరెడ్డి, డైరెక్టర్లు సిద్దయ్య, వంశీ గౌడ్, ఆరిఫ్, నగేష్, నరేష్, హనుమంత్‌రెడ్డి, సిఓలు సందీప్ మురళి, రైతులు పాల్గొన్నారు.

వాహనాల మళ్లింపు

- సాటాపూర్ రైల్వే గేటు మరమ్మతు పనులు



మరమ్మతులు చేస్తున్న కూలీలు



ఎస్సై వంశీ కృష్ణరెడ్డి

నవతెలంగాణ-ఎడపల్లి

మండలపరిధిలో గల సాటాపూర్ ఏక్స్ రోడ్డు వద్ద సోమవారం రైల్వేగేట్ మరమ్మతుల పనులు కోనసాగుతున్నాదున్న వాహనాలను దారి మళ్లించినట్టు ఎస్సై వంశీ కృష్ణరెడ్డి తెలిపారు. రెంజల్ నుంచి ఎడపల్లికి వాహనదారులు ఏఆర్పీక్యాంప్, అంబం(వై) మీదుగా రావాలని, నిజామాబాద్ వెళ్లే భారీ వాహనాలు, రెంజల్, నవీపేట్, జానాకంపేట్ మీదుగా వెళ్లాలని ఎస్ఐ తెలిపారు. వాహనదారులు రైల్వేశాఖ అధికారుల సిబ్బదికి, పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆకట్టుకున్న ఆర్మీ పారా గ్లైడింగ్ విన్యాసాలు



నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జిల్లా కేంద్రంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో సోమవారం సాయంత్రం ఆర్మీ అధికారుల నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు ఆకట్టుకున్నాయి. 250వ ఏటీసీ కార్ప్స్ డేను పురస్కరించుకుని సికింద్రాబాద్ ఆర్మీ కంటోన్మెంట్ ఆధ్వర్యంలో పారా మోటార్ ఎక్స్‌పెడిషన్-2025 పేరుతో యాత్రను చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీ నుంచి ప్రారంభమై ఈ యాత్ర ఆగ్రా, కాన్పూర్, ఝాన్సీ, సాగర్, జబల్పూర్, పుల్గాంల మీదుగా సాగుతూ, సోమవారం సాయంత్రం నిజామాబాద్ నగరానికి చేరుకుంది. ఈ యాత్రకు జిల్లా యంత్రాంగం తరపున అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జీ.జీ కళాశాల మైదానంలో సికింద్రా బాద్ ఆర్మీ కంటోన్మెంట్ లెఫ్టినెంట్ కల్నల్ అమత్ నేతృత్వంలో నిర్వహించిన పారా గ్లైడింగ్ విన్యాసాలు అలరింపజేశాయి. ఎన్.సీ.సీ క్యాడెట్‌లకు, యువతీ, యువకులకు పారా గ్లైడింగ్ పట్ల ప్రయోగాత్మకంగా అవగాహన కల్పిస్తూ, ఆసక్తిని పెంపొందింపజేశారు. ఈ యాత్రకు స్వాగతం పలికిన వారిలో డీ.ఎస్.ఓ అరవింద్ రెడ్డి, సివిల్ సప్లైస్ డీ.ఎం శ్రీకాంత్‌రెడ్డి, పోలీసు అధికారులు, ఎన్‌సీసీ అధికారులు ఉన్నారు.



గ్లైడింగ్‌లో పాల్గొన్న ఆర్మీ అధికారులు

జార్జ్ రెడ్డి వర్ధంతి సభలను విజయవంతం చేయాలి

- టీయూ పిడిఎస్‌యూ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న పిడిఎస్‌యూ నాయకులు

నవతెలంగాణ-డిచ్‌పల్లి

పిడిఎస్‌యూ విద్యార్థి సంఘం వ్యవస్థాపకుడు కామ్రేడ్ జార్జ్ రెడ్డి 53వ వర్ధంతి సభలను ఈనెల 10 నుంచి 14 వరకు జరపాలని పిడిఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి జన్నారపు రాజేశ్వర్ విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. సోమవారం టీయూ పిడిఎస్‌యూ ఆధ్వర్యంలో తెలంగాణ యూనివర్సిటీలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ముందు జార్జ్ రెడ్డి 53 వర్ధంతి పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కామ్రేడ్ జార్జ్ రెడ్డి ఉస్మానియా యూనివర్సిటీలో గ్రామీణ ప్రాంతాల విద్యార్థులపై జరుగుతున్న ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ దాడులకు వ్యతిరేకంగా, విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు చేశారని తెలిపారు. నేడు విద్యారంగంలో మనువాద భావజాలాన్ని ప్రవేశపెడుతున్నారని, యూనివర్సిటీ విద్యార్థుల మెదళ్లను కలుషితం చేసే పాఠ్యాంశాలను విద్యలో ప్రవేశపెడుతున్నారని, విద్యా కాషాయకరణ వ్యతిరేకంగా మరియు ప్రభుత్వ యూనివర్సిటీలలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం జార్జ్ రెడ్డి పోరాట స్ఫూర్తి తో పోరాడాలని అన్నారు. కార్యక్రమంలో తెలంగాణ యూనివర్సిటీ పి డి ఎస్ యూ నాయకులు ప్రిన్స్, దేవిక, రవీందర్, హుస్సేన్,ఆకాష్, రాజు, హన్మాండ్లు, విజయ్, సాయి, రాము తదితరులు పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న పోలీసులు



నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ ఏరియాలో ఓ వ్యక్తి మానసిక స్థితి సరిగా లేక ఎండలో ఉన్నాడు. గమనించిన పట్టణ పోలీసులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. పోలీస్ కానిస్టేబుల్‌లు అరుణ్, రాజిరెడ్డిలకు పట్టణ ప్రజలు హాట్స్ ఆఫ్ చెప్పారు.



సదాశివనగర్: పాదయాత్రలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు



దోమకొండలో...

కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలకు మహర్దశ

- రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి



శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే భూపతిరెడ్డి

నవతెలంగాణ-మోపాల్

మండల కేంద్రంలో 40 లక్షల రూపాయల వ్యయంతో మానవ వనరుల భవనానికి రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి సోమవారం శంకుస్థాపన చేశారు. తర్వాత ఎస్సీ కాలనీలో 20 లక్షల రూపాయలతో సిసి రోడ్లు మరియు డ్రైనేజీలు కూడా శంకుస్థాపన చేశారు. అనంతరం పది లక్షల రూపాయలతో ప్రాథమిక సహకార సంఘానికి సంబంధించిన కల్యాణ మండపానికి మరమ్మత్తుల నిమిత్తం 10 లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రూరల్ ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాతనే గ్రామాలకు మహర్దశ ప్రారంభమైందని ఇవాల్టి వరకు మోపాల్ మండలానికి ఒక కోటి 21 లక్ష రూపాయలు మంజూరు చేశామని తెలిపారు. త్వరలోనే పోలీస్ స్టేషన్, ఎంపీడీవో ఎమ్మార్వో భవనాలను కూడా నిర్మిస్తామని అన్నారు. అనంతరం నర్సింగ్‌పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కచ్చితంగా నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇల్లు వచ్చే విధంగా చూస్తారని విడతల వారీగా దారిద్ర రేఖ దివన్న వారికి మొదటి దశలో మంజూరు చేస్తామని కచ్చితంగా బేస్మెంట్ కాగానే లక్ష రూపాయలు వారీగా కచ్చితంగా ఐదు లక్షల రూపాయలు ప్రభుత్వం విడుదల చేస్తుందని తెలిపారు. ఆ తర్వాత ముదక్పల్లి గ్రామంలో గురడి రెడ్డి సంఘం మరమ్మత్తులకు 5లక్షల రూపాయలతో శంకుస్థాపన చేశారు. అతి త్వరలో ఇంకొన్ని నిధులు మంజూరు చేసి ముదక్ పల్లినీ ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఆయన హామీ ఇవ్వడం జరిగింది. అలాగే మంచిప్ప గ్రామంలో డ్వాక్రా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వడ్ల కొనుగోలుకు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కచ్చితంగా పాత డిజైన్ ప్రకారమే ప్రాజెక్టు చేపడుతున్నామని ఈ ప్రాజెక్టు ద్వారా లక్ష ఇరవై వేల ఎకరాలకు సాగు నీరు అందుతుందని తెలిపారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, టీపీసీసీ డెలిగేట్ శేఖర్ గౌడ్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి, మోపాల్ మండల అధ్యక్షుడు సాయి రెడ్డి, మాజీ విండోచైర్మన్ సూర్య రెడ్డి, ఫిషరీస్ చైర్మన్, శ్రీనివాస్, గంగారెడ్డి ,సతీష్ రావు, లింగన్న రాములు, ఎంపీడీవో రాములు నాయక్, ఎంపీఓ కిరణ్ కుమార్ రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజేశ్వరరావు, మిషన్ భగీరథ ఈ వినయ్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకులంలో సీటు సాధించిన విద్యార్థులు



విద్యార్థులను సన్మానించిన ఉపాధ్యాయ బృందం

నవతెలంగాణ-రాజంపేట్

మండలంలో ఆరేపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురుకుల 5వ తరగతి ప్రవేశ పరీక్షల(టిజిసిఈటి) 202 పరీక్షలు రాయడం జరిగింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థులు 5గురు ఎంట్రెన్స్ పరీక్ష రాశారు. వారిలో నుంచి 3 గురు విద్యార్థులు గురుకులాల్లో సీటు సాధించారు. మాసుల వర్షిత్, బీర్యాకరు రూపేష్, దివన్‌లు సెలెక్ట్ అయినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.నగేష్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ, ఉపాధ్యాయ బృందం తరపున ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎమ్.ఎస్. అనురాధ, శ్రీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్ర

నవతెలంగాణ-విలేకరుల బృందం

సదాశివనగర్ : మండలంలోని ఉత్నూర్ గ్రామంలో కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు జై బాబు, జై భీమ్, జై సంవిధాన్ పాదయాత్రను సోమవారం నిర్వహించారు. డప్పు, వైయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో కాంగ్రెస్ జిల్లా సేవదల్ అధ్యక్షులు బొంబోతుల లింగాగౌడ్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సంగారెడ్డి, ఏఎంసి చైర్మన్ సంగ్యా నాయక్, యూత్ అధ్యక్షుడు బొంబోతుల సంపత్‌గౌడ్, అన్వేష్‌గౌడ్, సొసైటీ చైర్మన్ గంగాధర్, శ్రీనివాస్‌గౌడ్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దోమకొండ: మండలంలోని అంచనూర్, సీతారాంపల్లి, గ్రామలలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్రబోయిన స్వామి మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగాన్ని అవమాన పరుస్తూ, రాజ్యాంగ స్ఫూర్తిని దెబ్బతీస్తు, అప్రజాస్వామ్య పాలన కోసాగిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి తీగల తిరుమలగౌడ్, మాజీ సర్పంచ్ జాలిగామ నాంపల్లి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పల్లె రామస్వామిగౌడ్, నల్లపు శ్రీనివాస్, నరేష్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాంపల్లి గ్రామంలో జై బాపు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమంలో భాగంగా పాదయాత్ర చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు.



రామారెడ్డి: నినాదాలు చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్ర..

రామారెడ్డి : మండల కేంద్రంలో రాజ్యాంగ పరిరక్షణ పాదయాత్రను కాంగ్రెస్ మండల పార్టీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రతాల గైడ్ నుంచి గాంధీ వరకు పాదయాత్ర నిర్వహించారు. అంబేద్కర్, గాంధీ విగ్రహాలకు పూలమాలు వేసి నివాళులర్పించారు. పలువురు మాట్లాడుతూ.. దేశంలో రాజ్యాంగ ఉల్లంఘన జరుగుతుందని, రాజ్యాంగ ఉల్లంఘనను అరికట్టవలసిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గొల్లపల్లి లక్ష్మా గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శీల సాగర్, మైనార్టీ మండల అధ్యక్షులు ఇర్ఫాన్, గ్రామ కమిటీ అధ్యక్షులు బిపేట రంజిత్, లేగల ప్రసాద్, ఆరుగొండ భాస్కర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజాంసాగర్

మండలంలోని మల్లూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలోని మల్లూర్, వడ్డేపల్లి, జక్కాపూర్, మల్లూరు తాండ గ్రామలలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు సోమవారం ప్రారంభించాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు నష్టపోకుండా ప్రభుత్వం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించింది.. కావున రైతులందరూ ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలలోని ధాన్యాన్ని విక్రయించాలని తెలిపారు. దళారులను నమ్మి ధాన్యాన్ని విక్రయించకూడదని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేశాయన్నారు. కార్యక్రమంలో పిట్లం మార్కెట్ కమిటీ చైర్మన్ మనోజ్, మల్లూరు సొసైటీ చైర్మన్ కళ్యాణి విఠల్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఏలే మల్లికార్జున్, నాయకులు బుడిమి మైసయ్య శ్రీనివాస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బుడిమే శ్రీనివాస్, భాస్కర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సన్న బియ్యం సంబురం

- లబ్దిదారుడి ఇంట్లో భోజనం చేసిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మద్నూర్

డోంగ్లి మండలంలోని సిర్పూర్ గ్రామంలో సన్న బియ్యం లబ్దిదారుడి ఇంట్లో కుటుంబ సభ్యులతో కలిసి ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు భోజనం చేశారు. సన్న బియ్యంతో వండిన భోజనం ఎలా ఉందని లబ్ది దారులను అడిగి తెలుసుకున్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 లకు సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకాలు వస్తున్నాయా అంటూ ఆరా తీశారు. ప్రజాప్రభుత్వం పేదలందరికీ నాణ్యమైన సన్నబియ్యం ఇచ్చి వారి కడుపు నింపుతుందన్నారు. సంపన్నులు తినే సన్న బియ్యాన్ని సామాన్యులకు ఉచితంగా పంపిణీ చేయడంతో ఊరూరా సంబురాలు చేసుకుంటున్నారని చెప్పారు. గతంలో దొడ్డు బియ్యం ఇస్తే వాటిని తినడానికి ఎవరూ ఆసక్తి చూపేవారు కాదని తెలిపారు. పథకం పక్క దారి పట్టి దళారులు, మిల్లర్లు లబ్ది పొందేవారని వివరించారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ పేదల సంక్షేమం కోసమే పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి, డోంగ్లి తహసీల్దార్ క్రాంతి కిరణ్, దొంగిలి ఇన్‌ఛార్జి, ఎంపీడీవో వెంకట నరసయ్య, మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య, వైస్ చైర్మన్ పరమేష్ పటేల్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి

- ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ దేవేందర్ రెడ్డి
- పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల ప్రారంభం



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన దేవేందర్‌రెడ్డి

నవతెలంగాణ-లింగంపేట్

రైతులు పండించిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ కూచంపల్లి దేవేందర్‌రెడ్డి రైతులకు సూచించారు. సోమవారం మండలంలోని లింగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు గ్రామాల్లో దళారులను నమ్మ వద్దన్నారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైనటువంటి సౌకర్యాలను కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో మనిటరింగ్ అధికారి రాధిక, సీఈఓ పెంటయ్య, వ్యవసాయ అధికారి అనిల్ కుమార్, ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజు, రైతు కమిటీ అధ్యక్షులు పెంటయ్య, రైతులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

నవతెలంగాణ-మద్నూర్

సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ప్రజల ఆరోగ్యానికి ఆసరాగా నిలుస్తుందని కుర్లా గ్రామ కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు గజానంద్ దేశాయి తెలిపారు. జుక్కల్ ఎమ్మెల్యే తోటా లక్ష్మీ కాంతారావు ఆదేశాల మేరకు కుర్లా గ్రామానికి చెందిన మల్లికార్జున్ లబ్ధిదారునికి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును డోంగ్లీ తహసీల్దార్ కార్యాలయంలో ఆయన లబ్ధిదారునికి సోమవారం అందజేశారు. కార్యక్రమంలో డోంగ్లి తహసీల్దార్, కార్యాలయ ఆర్ఐ, తదితరులు పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత